చిన్న దేశానికి అతి పెద్ద విపత్తు
- పపువా న్యూ గినియాలో విరిగిపడ్డ కొండచరియలు
- 670 మందికి పైగా సజీవ సమాధి

2

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 291 | విజయవాడ, సోమవారం 27 మే 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 27 May 2024 | Rs



అన్నదాతకు


'పెట్టుబడి' ప్రశ్నార్థకం

వైసిపి భరోసా-పిఎం కిసాన్

టిడిపి ఆర్థిక సాయం

కేంద్రంలో, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాలొచ్చాకే క్లారిటీ

అప్పటి వరకు ఖరీఫ్ రైతుకు ఎదురు చూపులే



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఖరీఫ్ ముంచుకొస్తున్న వేళ రైతులకు పెట్టుబడి సాయం ప్రశ్నార్థకంగా తయారైంది. గత ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వం 'రైతుభరోసా' పేరిట ఆర్థిక సాయం అందించింది. కేంద్రంలోని బిజెపి సర్కారు 'పిఎం కిసాన్' పేరిట సొమ్ము విడుదల చేసింది. ఈ రెండూ నగదు బదిలీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్-డిబిటి) స్కీములు. జనరల్ ప్లాన్ పథకాలు (ఆన్ గోయింగ్) కాదు. అందువల్ల కేంద్రంలో, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాలొచ్చాకనే వాటి అమలు భవితవ్యం తేలుతుంది. సరిగ్గా ఖరీఫ్ పనులు ముమ్మరమవుతున్న సమయాన రైతులకు ఈ సంకట స్థితి ఎదురైంది. ఇదిలా ఉండగా రైతులకు నగదు బదిలీ చేసే విషయంలో ఇప్పుడు అమలవుతున్నట్లుగానే ఏడాదికి మూడు కిస్తుల్లో రూ.6 వేలు... మళ్లీ తాము అధికారంలోకొస్తే కొనసాగిస్తామని బిజెపి తన మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. ప్రతి నాలుగు మాసాలకూ రూ.2 వేలు చొప్పున ఇస్తామంది. ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే వైసిపి తన మేనిఫెస్టోలో 'నవరత్నా'లలో భాగంగా రైతులకు ఇప్పటి వరకు ఏడాదికి రూ.13,500 ఇచ్చామని, తిరిగి అధికారంలోకొస్తే రూ.16 వేలు ఇస్తామంది. టిడిపి-జనసేన కలిసి 'ప్రజాగళం' టైటిల్‌తో విడుదల చేసిన మేనిఫెస్టోలో 'సూపర్ సిక్స్' అంటూ అన్నదాతలకు ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సాయం చేస్తామన్నారు. ఈ ప్రణాళికకు బిజెపి గ్యారంటీ ఇవ్వలేదు. ఆర్థిక సాయం ఎంత, ఎంత మంది రైతులకు ఇచ్చేదీ స్పష్టత రావాలంటే కొత్త ప్రభుత్వాలు కొలువుదీరాలి. అంతకుముందే వర్షాలు పడుతున్నందున ఖరీఫ్ పనులకు సమాయత్తమవుతున్న రైతులకు పెట్టుబడి సాయం అందే పరిస్థితి లేదు. నిరుడు కరువు, తుపాన్, అకాల వర్షాలతో భారీ నష్టాలు చవిచూసిన అన్నదాతలకు ప్రభుత్వాలిచ్చే అరకొర సాయమూ ఈమారు ఇప్పుడప్పుడే అందేటట్లు లేదు.

షరతులు వర్తిస్తాయి!

ఎన్నికల మేనిఫెస్టోల్లో పార్టీలు ఇచ్చే హామీలకు, కార్యాచరణకు మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది. రైతులకు, కౌలు రైతులందరికీ ప్రతి ఏడాదీ ఏకమొత్తంలో ఖరీఫ్‌కు ముందు పెట్టుబడి సమకూరుస్తామని వైసిపి చెప్పింది. ఆచరణలోకొచ్చేసరికి కేంద్ర పథకంతో కలపడంతో మూడు కిస్తుల్లో, అదీ కేంద్ర నిధులతో కలిపి అమలు చేసింది. ఏడాదికి కేంద్రం రూ.6 వేలిస్తే, రాష్ట్రం రూ.7,500 ఇచ్చింది. తిరిగి అధికారంలోకొస్తే వైసిపి ఇస్తామంటున్న రూ.16 వేలు కూడా ఇదే తరహాలోనే ఇస్తుంది. ఒక వేళ కేంద్రంలో బిజెపి రాకపోతే... ఇప్పటి వరకు కేంద్రం పెట్టుకున్న రూ.6 వేలు జమ కాకపోతే, రాష్ట్రం ఏం చేస్తుందనే ప్రశ్నకు వైసిపి నుంచి జవాబు లేదు.

ఆ దారిలోనే టిడిపి

2014 ఎన్నికలకు ముందు టిడిపి, బ్యాంకుల్లోని రైతులందరి రుణాలూ మాఫీ చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది. అధికారంలోకొచ్చాక కేవలం పంట రుణాలేనంది. ఒకేసారి కాకుండా ఐదు విడతల్లో మాఫీ అని, అదీ రూ.లక్షన్నర వరకేనని పరిమితి విధించింది. గోల్డ్ లోన్ల రద్దుకు మూడవ ప్రాధాన్యతనిచ్చింది. ఆ విధంగా కోతలు పెట్టి కూడా అనుకున్న దాంట్లో రూ.9 వేల కోట్లు మాఫీ చేయకుండా దిగిపోయింది. వైసిపి సర్కారు రైతులకు ఆ బకాయిలు చెల్లించకుండా ఎగనామం పెట్టింది. తిరిగి 2024 మేనిఫెస్టోలో రైతులకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తామంది టిడిపి. కౌలు రైతుల ప్రస్తావన చేయలేదు. వైసిపి మాదిరిగా కేంద్రానికి చెందిన 'పిఎం కిసాన్'ను కలుపుతారా, విడిగా ఇస్తారా క్లారిటీ ఇవ్వలేదు. అలాగే విడతల్లో ఇస్తారా, ఒకేసారి ఇస్తారా చెప్పలేదు.

కెకెఆర్ తీన్‌మార్

ఐపిఎల్ 2024 టైటిల్ కోల్‌కతా నైట్‌రైడర్స్ వశం

ఫైనల్లో సన్‌రైజర్స్‌కు భంగపాటు

హైదరాబాద్ బ్యాటర్ల వైఫల్యం

హైదరాబాద్ 113/10, కోల్‌కతా 114/2

ఆదివారం చెపాక్‌లో జరిగిన ఫైనల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై గెలుపొందిన కోల్‌కతా నైట్‌రైడర్స్ ముచ్చటగా మూడోసారి ఐపిఎల్ ఛాంపియన్‌గా అవతరించింది. 2012, 2014లో గంభీర్ కెప్టెన్సీ టైటిల్ కొట్టిన కోల్‌కతా 2024లో గంభీర్ కోచింగ్ సారథ్యంలో టైటిల్ అందుకుంది.



సన్‌రైజర్స్ బ్యాటర్లు చేతులెత్తేశారు. పరుగుల వరద పక్కనపెడితే.. కనీసం పోటీ ఇవ్వగల స్కోరు సాధించలేదు. కోల్‌కతా పేసర్లు స్టార్క్, రానా, రసెల్ విజృంభించటంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ 18.3 ఓవర్లలో 113 పరుగులకే కుప్పకూలింది. ఐపిఎల్ ఫైనల్స్‌లో ఇదే అత్యల్ప స్కోరు. ఈ సీజనో కోల్‌కతా చేతిలో హైదరాబాద్‌కు ఇది హ్యాట్రిక్ పరాజయం. స్వల్ప లక్ష్యాన్ని కోల్‌కతా బ్యాటర్లు ఆడుతూ పాడుతూ ఛేదించారు. వెంకటేశ్ అయ్యర్ (52 నాటౌట్), రెహ్మానుల్లా గుర్బాజ్ (39) పవర్‌ప్లేలోనే టైటిల్ విజయం లాంఛనం చేశారు. మరో 57 బంతులు ఉండగానే లక్ష్యాన్ని ఛేదించిన కోల్‌కతా నైట్‌రైడర్స్ సన్‌రైజర్స్‌పై ఈ సీజన్లో మూడో విజయంతో పాటు ఐపిఎల్‌లో మూడో టైటిల్‌ను ముద్దాడింది.

చెన్నై : కోల్‌కతా నైట్‌రైడర్స్ సాధించింది. 2022, 2023 సీజన్లలో ఏడో స్థానానికి పరిమితమై కనీసం ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించని నైట్‌రైడర్స్ 2024 ఐపిఎల్ ఛాంపియన్‌గా అవతరించింది. ఆదివారం చెన్నై చెపాక్ స్టేడియంలో జరిగిన ఐపిఎల్ 17వ సీజన్ ఫైనల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన కోల్‌కతా నైట్‌రైడర్స్ మూడోసారి టైటిల్ సొంతం చేసుకుంది. 114 పరుగుల ఛేదనలో కోల్‌కతా బ్యాటర్లు అదరగొట్టారు. ఓపెనర్ రెహ్మానుల్లా గుర్బాజ్ (39, 32 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సులు) మెరువగా.. నం.3 బ్యాటర్ వెంకటేశ్ అయ్యర్ (52 నాటౌట్, 26 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు) అజేయ అర్ధ సెంచరీతో చెలరేగాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (6 నాటౌట్) ఆకట్టుకున్నాడు. 10.3 ఓవర్లలోనే కోల్‌కతా నైట్‌రైడర్స్ లాంఛనం ముగించింది. రెహ్మానుల్లా, వెంకటేశ్ రెండో వికెట్‌కు 91 పరుగులు జోడించి సన్‌రైజర్స్ ఆశలు ఆవిరి చేశారు. సునీల్ నరైన్ (6) నిరాశపరిచాడు. తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను కోల్‌కత పేసర్లు మిగతా 2లో

తప్పిన తుపాను.. పెరిగిన ఉక్కపోత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రెమాల్ తుపాను ముప్పు రాష్ట్రానికి తప్పినా.. ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగి తీవ్రమైన వడగాడ్పులు వీస్తూ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఆదివారం పలు జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలతోపాటు వడగాడ్పులు వీయడంతో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రాష్ట్రంలోని ఎన్‌టిఆర్ జిల్లాలో 40.9 డిగ్రీలు, పల్నాడు జిల్లాలో 40.8 డిగ్రీలు, ప్రకాశం జిల్లాలో 40.7, తిరుపతి జిల్లాలో 40.6 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు ఆదివారం నమోదయ్యాయి. అలాగే కృష్ణా, నెల్లూరు, ఏలూరు, కాకినాడ జిల్లాల్లోనూ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ ఒక ప్రకటన విడుదల చేశారు. మళ్లీ ఉష్ణోగ్రతలు భారీగా పెరిగే అవకాశం వుందన్నారు. సోమవారం 272 మండలాల్లో అధిక ఉష్ణోగ్రతలతో వడగాడ్పులు వీచే అవకాశం వుందని అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో 3 మండలాలు, విజయనగరం జిల్లాలో 17, పార్వతీపురం మన్యం జిల్లాలో 10, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 2, అనకాపల్లిలో 2, కాకినాడలో 6, కోనసీమలో 2, తూర్పుగోదావరిలో 17, పశ్చిమగోదావరిలో 3, ఏలూరులో 7, కృష్ణాలో 2, బాపట్ల జిల్లాలో ఒకటి చొప్పున ఆయా మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం వుందన్నారు.

శ్రీకాకుళం జిల్లాలోని 12 మండలాలు, విజయనగరం జిల్లాలో 7, పార్వతీపురం మన్యం జిల్లాలో 5, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 8, విశాఖపట్నంలో ఒకటి, అనకాపల్లిలో 14, కాకినాడలో 14, కోనసీమలో 11, తూర్పుగోదావరిలో 2, పశ్చిమగోదావరిలో 13, ఏలూరులో 21, కృష్ణాలో 19, ఎన్‌టిఆర్‌లో 17, గుంటూరులో 17, పల్నాడులో 12, బాపట్లలో 19, ప్రకాశం జిల్లాలో 8 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం వుందని అన్నారు. తీవ్ర వడగాడ్పులు, వడ గాడ్పులు వీచే మండలాల్లోని ప్రజలు అప్రమత్తంగా వుండాలని కోరారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గుండె జబ్బులున్నవారు, రక్తపోటు, షుగర్ వ్యాధిగ్రస్తులు కూడా ఇళ్లకే పరిమితం కావాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్లల్లోంచి బయటకు రావొద్దని సూచించారు.

ఆర్‌ఓ సీల్ లేకపోయినా ఓటును తిరస్కరించొద్దు : ఇసి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోస్టల్ బ్యాలెట్‌పై ఆర్‌ఓ సంతకంతో సహా పూర్తి వివరాలు నింపివుంటే ఆయా ఓట్లు చెల్లుబాటవుతాయని, సీల్ వేయలేదనే కారణంతో ఆయా ఓట్లు తిరస్కరించకూడదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. పోస్టల్ బ్యాలెట్ కవర్‌పై ఓటరు సంతకం లేదనే కారణంతో కూడా ఓటును తిరస్కరించరాదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు ఆదివారం సిఇఓ ముఖేష్‌కుమార్‌మీనా ఎన్నికల అధికారులకు స్పష్టం చేస్తూ ఉత్వర్వులు జారీ చేశారు. ఫారమ్ 13-ఎ పై రిటర్నింగ్ అధికారి సంతకం సహా బ్యాలెట్‌ను ధృవీకరించేందుకు రిజిస్టర్‌తో సరిపోల్చుకోవాలని సూచించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ దఫా 4.44లక్షల మంది ఉద్యోగులు, వృద్ధులు, వికలాంగులు, అత్యవసర సర్వీస్ ఓటర్లతో కలిపి 4.97లక్షల మంది పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకున్నారు. ఫారమ్-13ఎలో ఓటరు సంతకం లేకపోయినా, ఆర్‌ఓ సంతకం లేక పోయినా, బ్యాలెట్ సీరియల్ నెంబర్ లేని పోస్టల్ బ్యాలెట్స్‌ను తిరస్కరించవచ్చని ఎన్నికల సంఘం పేర్కొంది. ఓటు రికార్డు కాకుండా ఉంటే ఆ ఓటు చెల్లదు.

ఢిల్లీ ఆసుపత్రిలో మంటలు

ఏడుగురు నవజాత శిశువులు ఆహుతి

- 12 మంది చిన్నారులను కాపాడిన అగ్నిమాపక సిబ్బంది
- ఆక్సిజన్ సిలిండర్ పేలుడే కారణమా?
- హాస్పిటల్ యజమాని అరెస్టు





ఆస్పత్రి యజమాని నవీన్, వైద్యుడు వివేక్

న్యూఢిల్లీ: శనివారం గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో గేమింగ్ జోన్‌లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదం నుంచి దేశం తేరుకోక ముందే మరో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. తూర్పు ఢిల్లీలోని వివేక్ విహార్ ఏరియాలోని బేబీ కేర్ న్యూ బోర్న్ ఆసుపత్రిలో చోటు చేసుకున్న ఈ ఘటనలో ఏడుగురు పసికందులు అగ్నికి ఆహుతయ్యారు. మరో ఐదుగురు చిన్నారులు కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరుగురు పసికందులు అక్కడికక్కడే చనిపోగా, మరో నవజాత శిశువు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. హృదయవిదారకమైన ఈ ఘటన ప్రతి ఒక్కరినీ కలచివేసింది. ఈ ప్రమాదానికి ఆక్సిజన్ సిలిండర్ పేలుడే కారణమని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నా యి..దర్యాప్తులో కానీ, అసలు విషయం తేలదని పోలీసులు పేర్కొన్నారు. శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. విషయం తెలియగానే 16 అగ్నిమాపక శకటాలతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పే యత్నం చేశాయి. ఆసుపత్రిలో ఒక వార్డు నుంచి మరొక వార్డుకు మంటలు దావానలంలా వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది అతి కష్టం మీద 12 మంది చిన్నారులను కాపాడారు దీనిపై కేసు నమోదు చేసి ఆసుపత్రి యజమాని డాక్టర్ నవీన్ కిచ్చిని పోలీసులు అరెస్టు చేశారు. అతను ఢిల్లీలో మరికొన్ని ఆసుపత్రులను కూడా నడుపుతున్నాడని పోలీసుల దర్యాప్తులో తేలింది. గాయపడిన శిశువులకు వేరే ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. వీరిలో కొందరి పరిస్థితి ఆందోళన కరంగా ఉన్నట్లు సమాచారం. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిటిబి ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ తీవ్రంగా స్పందించారు. 'అమాయక శిశువులను కోల్పోయిన తల్లిదండ్రులకు అండగా ఉంటాం. ఈ నిర్లక్ష్యానికి కారణమైన వారెవర్నీ విడిచిపెట్టం' అని కేజ్రీవాల్ తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు జరుపుతు న్నట్లు చెప్పారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ కూడా ఈ ఘటనపై సోషల్ మీడియాలో స్పందించారు.

తెలుగు మీడియా విశ్వసనీయత!



గిరిపుత్ర

తెలుగునాట మీడియాకు విశ్వసనీయత తగ్గిపోయిందని ఓ పత్రికాధిపతి ఇప్పుడు గుండెలు బాదుకోవడం ఆశ్చర్యకరం. నిజానికి ఈ శతాబ్దపు తొలి దశాబ్దంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇందుకు బీజాలు పడగా రాష్ట్ర విభజన అనంతరం అది మరింత వెర్రితలలు వేసింది. రెండక్షరాల పత్రిక వచ్చాక మొదలైన మీడియా విభజన క్రమం ఆ తరువాత మరోవైపున 'ఆ రెండు పత్రికలు' అన్న పరిస్థితికి వెళ్లింది. అది ఎలక్ట్రానిక్ మీడియాకూ పాకింది. రాజకీయాల్లో ఎలాగైతే రెండు శిబిరాలుగా నిట్టనిలువునా చీలిన పరిస్థితి (బైపోలార్ పాలిటిక్స్) ఏర్పడిందో (విధాన ప్రాతిపదికన నిలబడే ప్రజాశక్తి వంటివి తప్ప) ప్రధాన మీడియాగా చెప్పబడేవన్నీ అలానే విభజితమయ్యాయి. ఒక పార్టీ కొమ్ము కాయడానికి వాస్తవాలను కప్పిపెట్టడం, అవాస్తవ ఆరోపణలను సైతం పదేపదే ప్రస్తావించడం వాటికి సర్వసాధారణమైపోయింది. చివరికి వాస్తవమేమిటో తెలుసుకోవాలంటే వాటిలో ఏ ఒక్క పత్రికనో చదివితే చాలదు అనే నిర్ధారణకు పాఠకులు వచ్చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే దాన వీర శూర కర్ణ సినిమాలో విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు ఎన్‌టి రామారావు గుక్కతిప్పుకోకుండా చెప్పిన 'ఏమంటివి ఏమంటివి... కురు వంశం ఏనాడో కులవిహీనమైనది' అన్న ప్రఖ్యాత డైలాగ్ గుర్తుకొస్తోంది. తిలా పాపం తలా పిడికెడన్న చందంగా ఈ పరిస్థితి ఏర్పడడానికి ఎవరు ఎంతవరకు కారణమో ప్రధాన మీడియా సంస్థలు, వాటి యాజమాన్యాలూ ఇప్పటికైనా పరిశీలించుకోవడం అవసరం. వారు తమ వైఖరులు సరిదిద్దుకుంటే తెలుగు మీడియాకు తప్పక విశ్వసనీయత పెరుగుతుంది. పాఠకులు, వీక్షకులూ ఆదరించడం తథ్యం!

కార్పొరేట్ మీడియా దుర్నీతి...

గుజరాత్ అభివృద్ధి మోడల్ అనీ, మోడీని ఎంతగానో ప్రస్తుతిస్తూ 2014 ఎన్నికలకు ముందు కార్పొరేట్ మీడియా సాగించిన హంగామా ఇంతా అంతా కాదు. అభివృద్ధి ఎజెండా అంటూ వారు ఊదరగొట్టిన తీరు మరువగలమా! అలాగే 2019 ఎన్నికలకు ముందు పుల్వామా ఘటనల ఆధారంగా ఉద్వేగాలు రెచ్చగొట్టడంలో మీడియా పాత్ర తక్కువేమీ కాదు. ముఖ్యంగా పుకార్లు ప్రచారం చేయడంలో సంఘ్ పరివార్ వాట్సాప్ యూనివర్సిటీ సృష్టించిన అరాచక అసంఖ్యాక పోస్టులు ఎందరి బుర్రలు ఖరాబు చేశాయో! ప్రస్తుత రాజకీయాల్లో కార్పొరేట్ మీడియా అదేవిధంగా సోషల్ మీడియా పాత్ర, ప్రభావం గణనీయంగానే ఉంటోంది. గత రెండు సాధారణ ఎన్నికల్లో ఈ రెండు మీడియాలు లేకుండా మోడీ అండ్ కో గెలుపును ఎవరైనా ఊహించగలరా? ఆంధ్రప్రదేశ్‌లో కూడా వాటి ప్రభావాన్ని తీసి పారేయగలమా! అంతేకాదు.. పాలనా వ్యవహారాలకు సంబంధించి కూడా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి ప్రభుత్వానికి చికాకు తెప్పించినవి కొన్ని కాగా మార్ఫింగ్ సైతం చేసి దుష్ప్రచారం గావించినవి అనేకం.

సిపిఎంపై అక్కసు...!

దేశానికి, ఆంధ్రప్రదేశ్‌కు తీరని ద్రోహం చేస్తున్న బిజెపిని ఒంటరిపాటు చేసి ఓడించాలనీ, రాష్ట్ర రాజకీయాలు నిట్టనిలువునా చీలిపోయిన నేపథ్యంలో వైసిపి, టిడిపి రెండు శిబిరాలనూ వ్యతిరేకించి వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులతో ప్రత్యామ్నాయ శక్తులను సమీకరించాలని సిపిఎం నిర్ణయించుకుంది. అందుకు తన శక్తికొద్దీ కృషి చేస్తోంది. ఈ ఎన్నికల్లో సిపిఐ, సిపిఎం మధ్య ఎలాంటి విభేదాలు పొడసూపకపోవడమేగాక ఇతర వామపక్ష శక్తులు కూడా సమన్వయంతో పని చేసిన విషయం గుర్తెరగాలి. అదేవిధంగా బిజెపికి వ్యతిరేకంగా రాజ్యాంగ పరిరక్షణ సమితి నేతలు నిర్వహించిన ఉమ్మడి సదస్సులు, చేపట్టిన ప్రచారం ప్రజలపై ముఖ్యంగా లౌకిక ప్రజాస్వామ్య భావాలు కలిగినవారిని ప్రభావితం చేశాయి. గడచిన పదేళ్లలో ఈ రాష్ట్రంలో జరిగిన ప్రజా ఉద్యమాలన్నిటిలోనూ సిపిఎం క్రియాశీలక పాత్ర వహించింది. ఉద్యోగులు, ఉపాధ్యాయుల మొదలు అసంఘటిత కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా తదితర స్కీమ్ వర్కర్ల సమస్యలపై శ్రమజీవులకు వెన్నుదన్నుగా నిలిచింది. సామాన్యుల కోర్కెలను ఎల్లవేళలా ముందుంచింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజి, పోలవరం నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కోసం, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిలకడగా ఉద్యమాలు నిర్వహించింది. ఇంకా చెప్పాలంటే గతంలో చంద్రబాబు, ఇటీవలి ఎన్నికల సమయంలో జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఎవరున్నా వారి పర్యటనల సందర్భంగా సిపిఎం కార్యకర్తలు, నాయకులనే గృహ నిర్బంధం లేదా ముందస్తు అరెస్టు చేస్తున్నారంటే రెండు పాలక పార్టీలకూ వారంటే ఎంత కంటగింపో విదితమవుతోంది. అలాంటిదీ మీడియా గురించి విశ్లేషించే సందర్భంలో ఆ పార్టీ గురించి ఒక సబ్ హెడింగ్ పెట్టి మరీ 'ఉనికి కోసం వెతుక్కునే పరిస్థితి'లో ఉందని వ్యాఖ్యానించడం సబబేనా!

జర్నలిజం శాస్త్రీయం..

ఒక పర భాషా విశ్లేషకునిపై వ్యాఖ్యానిస్తూ 'ప్రజల నాడి పసిగట్టలేని జర్నలిస్టులు, విశ్లేషకులు తెలుగునాట ఉన్నారనే కదా దీని అర్థం!' అని పేర్కొనడం మనల్ని మనం కించపరుచుకోవడం కూడా అవుతుంది. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితిని ఎవరైనా జర్నలిస్టు రాస్తే లేదా చెబితే 'అలా కాదు.. మేం చెప్పినట్టు చెయ్యండి' అంటూ వారి నోళ్లు నొక్కిన అగ్రశ్రేణి తెలుగు మీడియా సంస్థల యాజమాన్యాల నిజస్వరూపం తెలియనిదెవరికి? ముఖ్యంగా మీడియా రంగంలో ఉన్నవారికి..! జర్నలిజం శాస్త్రీయమైనది. వాస్తవ పరిస్థితులను వస్తుగతంగా పరిశీలించి, భూత భవిష్యత్ వర్తమానాలకు దాన్ని అన్వయించి విశ్లేషిస్తే అది తప్పక ప్రజామోదాన్ని ఆదరణనూ పొందుతుంది. అయితే, నయా ఉదారవాద ఆర్థిక విధానాల నేపథ్యంలో పాలకవర్గాలు ప్రధానంగా ద్రవ్య పెట్టుబడి శక్తులు వాస్తవాలను ఎలా మసిబూసి మారేడు కాయ చేస్తున్నాయో ప్రముఖ జర్నలిస్టు నోమ్ ఛామ్‌స్కీ తన 'మాన్యుఫాక్చరింగ్ కన్సెంట్' గ్రంథంలో విపులంగా వివరించారు. ఆయన తెలుగువాడు కాదు.. అసలు ఈ దేశస్థుడే కాదు! కాని ఆయన చెప్పినవన్నీ అక్షర సత్యాలు.

పాన్ మసాలా, గుట్కాలపై నిషేధం పొడిగింపు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో, చెన్నై



తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో పొగాకు, నికోటిన్ కలిగిన గుట్కా, పాన్ మసాలాలపై నిషేధాన్ని ఆయా ప్రభుత్వాలు మరో ఏడాదిపాటు పొడిగించాయి. ఈ మేరకు ఆయా రాష్ట్రాల ఫుడ్ సేఫ్టీ కమిషనర్లు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వీటి తయారీ, నిల్వ, పంపిణీ, రవాణా, అమ్మకాలపై నిషేధాన్ని మరో ఏడాది పాటు పొడిస్తున్నట్లు ఈ ఉత్వర్వుల్లో వారు పేర్కొన్నారు. సాచెట్స్, పౌచెస్, కంటేనర్లు తదితర ఏ రూపాల్లో ప్యాక్ చేసినవైనా నిషేధం వర్తిస్తుందని తెలిపారు. ముందుగా ఈ ఉత్పత్తులపై నిషేధం విధిస్తూ తమిళనాడు ప్రభుత్వం 2018 మేలోనే నిర్ణయం తీసుకుంది. మద్రాస్ హైకోర్టు ఈ నిషేధాన్ని ఎత్తివేసింది. హైకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మద్రాస్ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది.



రేవంత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాలకృష్ణ

తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డితో బాలయ్య భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రముఖ నటులు, టిడిపి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ భేటీ అయ్యారు. ఆదివారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని రేవంత్ నివాసంలో వారు సుమారు గంట సేపు సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు జరిగిన తీరు, ఆయా పార్టీల విజయావకాశాలపై చర్చించుకున్నారు. బసవతారకం ఆస్పత్రి అందిస్తున్న వైద్య సేవలను ముఖ్యమంత్రికి బాలకృష్ణ వివరించారు. పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా కేన్సర్ స్క్రీనింగ్ శిబిరాలను నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ, బసవతారకం ఆస్పత్రికి అన్నివిధాలుగా రాష్ట్రప్రభుత్వం సహకరిస్తుందని చెప్పారు. బాలకృష్ణ వెంట బసవతారకం ఆస్పత్రి వైద్యులు డాక్టర్ కె కృష్ణయ్య, డాక్టర్ జె శివరాంప్రసాద్ ఉన్నారు.

మాచర్ల ఎమ్మెల్యే సోదరుడిపై కేసు

- మంగళగిరి పోలీస్ స్టేషన్లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తమ్ముడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిపై మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ఎన్నికల పోలింగ్ రోజున తనపైనా, తన కుటుంబ సభ్యులపైనా వెంకట్రామిరెడ్డి దాడి చేశారంటూ పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం కండ్లకుంట గ్రామానికి చెందిన టిడిపి ఏజెంట్ ఆదివారం చేసిన ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మాణిక్యంతో పాటు పలువురు టిడిపి నాయకులు మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ ఘటన తమ పరిధిలోనిది కాదని, సంబంధిత స్టేషన్లో ఫిర్యాదు చేయాలని అధికారులు వారికి చెప్పారు. దీంతో వారు డిజిపి కార్యాలయానికి వెళ్లి జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరారు. తనను కులం పేరుతో దూషించారని, తన కుటుంబ సభ్యులను చంపేస్తానని వీడియో కాల్ చేసి బెదిరించారని ఫిర్యాదులో మాణిక్యం పేర్కొన్నారు. స్థానిక పోలీసులు తమకు సహకరించలేదని, పోలింగ్ కేంద్రంలో బెదిరించారని, ఒక డిఎస్‌పి కూడా వారిని నివారించకుండా తనపై దాడికి ప్రయత్నించారని ఈ ఫిర్యాదులో ఆరోపించారు. ఎన్నికల రోజు ఉన్న అధికారులు సహకరించలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపారు.

యుపిలో రోడ్డు ప్రమాదం

12 మంది మృతి

లక్నో : యాత్రీకులతో వెళుతున్న బస్సుపై కంకర లోడ్‌తో వెళుతున్న ట్రక్కు బోల్తా పడడంతో 12 మంది మృతి చెందిన సంఘటన ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్ జిల్లాలో జరిగింది. శనివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో మరో తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిని షాజహాన్‌పూర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో చేర్చినట్లు పోలీసులు తెలిపారు. రాష్ట్రంలోని సీతాపూర్ జిల్లాకు చెందిన యాత్రీకులు ఒక అద్దె బస్సులో ఉత్తరాఖండ్‌లో ఉన్న పూర్ణగిరి ఆలయాన్ని దర్శించడానికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఖుతార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హాజియాపూర్ గ్రామంలో ఒక హోటల్ వద్ద భోజనం కోసం ఆగిన సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

కెకెఆర్ తీన్‌మార్

(మొదటి పేజీ తరువాయి)

మిచెల్ స్టార్క్ (2/14), హర్షిత్ రానా (2/24), అంద్రీ రసెల్ (3/19) స్వింగ్, పేస్, స్లో బాల్స్‌తో వణికించారు. 18.3 ఓవర్లలోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ 113 పరుగులకు కుప్పకూలింది. కెప్టెన్ పాట్ కమిన్స్ (24, 19 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), హెన్రిచ్ క్లాసెన్ (16, 17 బంతుల్లో 1 ఫోర్), ఎడెన్ మార్క్రామ్(20, 23 బంతుల్లో 3 ఫోర్లు) చెప్పుకోదగిన పరుగులు సాధించారు. ట్రావిశ్ హెడ్ (0), అభిషేక్ శర్మ (2) విఫలమయ్యారు.

టాప్ ఫ్లాప్ షో : ఐపిఎల్ ఫైనల్లో టాస్ నెగ్గిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆ తర్వాత ఏదీ కలిసి రాలేదు. ఎర్రమట్టి పిచ్‌పై తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన సన్‌రైజర్స్ ఓపెనర్లను ఆరంభంలోనే కోల్పోయింది. అభిషేక్ శర్మ (2)ను మిచెల్ స్టార్క్ సూపర్ బాల్‌తో క్లీన్‌బౌల్డ్ చేయగా.. ట్రావిశ్ హెడ్ (0)ను తొలి బంతికే వైభవ్ అరోరా సాగనంపాడు. విధ్వంసక ఓపెనర్లు ఇద్దరూ ఆరు బంతుల్లో 2 పరుగులకే నిష్క్రమించగా సన్‌రైజర్స్ శిబిరం నైరాశ్యంలో కూరుకుంది. రాహుల్ త్రిపాఠి (9) దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించినా.. మిచెల్ స్టార్క్ ముందు తలొంచక తప్పలేదు. ఓ ఫోర్, సిక్సర్‌తో ఆశలు రేపిన తెలుగు తేజం నితీశ్ కుమార్ (13) హర్షిత్ రానా ఓవర్లో వికెట్ పారేసుకున్నాడు. దీంతో 47/4తో సన్‌రైజర్స్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుంది. టాప్-3 బ్యాటర్లలో ఎవరూ రెండెంకల స్కోరు అందుకోలేకపోయారు.

క్లాసెన్ ఆదుకోలేదు : ఈ సీజన్లో హైదరాబాద్‌ను క్లిష్ట పరిస్థితుల్లో నిలకడగా ఆదుకున్న హెన్రిచ్ క్లాసెన్ (16) సైతం ఈసారి నిలబడలేదు. ఎడెన్ మార్క్రామ్ (20)తో కలిసి క్లాసెన్ కాసేపు వికెట్ల పతనం ఆపాడు. దీంతో నెమ్మదిగా ఇన్నింగ్స్ గాడిలో పడినట్టే అనిపించింది. కానీ మార్క్రామ్ వికెట్‌తో కథ మళ్లీ మొదటికొచ్చింది. షాబాజ్ అహ్మద్ (8), ఇంపాక్ట్ ప్లేయర్ అబ్దుల్ సమద్ (4) సహా జైదేవ్ ఉనద్కత్ (4) నిరాశపరిచారు. పాట్ కమిన్స్ (24) రెండు ఫోర్లు, ఓ సిక్సర్‌తో జట్టు స్కోరు వంద పరుగుల మార్క్ దాటించాడు. 18.3 ఓవర్లలోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ 113 పరుగులకు ఆలౌటైంది.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటుపరం కానివ్వం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నర్సింగరావు
- 1200 రోజులకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం కానిచ్చేది లేదని, కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నర్సింగరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1200వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సిఐటియు), విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా.. పోరాటాలతో ఉక్కును రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలు, 64 గ్రామాల ప్రజల భూముల త్యాగం, 64 మంది కమ్యూనిస్టు ఎమ్మెల్యేల రాజీనామాలతో నాడు ఉక్కు కర్మాగారం ఏర్పాటైందని గుర్తు చేశారు. విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదంతో రాష్ట్రం మార్మోగిందన్నారు. అంతటి చరిత్ర ఉన్న ఉక్కు కర్మాగారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయివేటుపరం కానిచ్చేది లేదన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

ఉక్కు పరిరక్షణ పోరాటంలో కచ్చితంగా విజయం సాధిస్తామని స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నూరు శాతం వ్యూహాత్మక అమ్మకం చేస్తామని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రకటించిన దగ్గర నుంచీ చేపట్టిన ఆందోళనలు, దీక్షలకు 1200 రోజులు పూర్తయ్యాయని తెలిపారు.

ప్రభుత్వాల ప్రయివేటీకరణ కుట్రలను ఉద్యమం ద్వారా తిప్పికొట్టామన్నారు. ఉక్కు పోరాటంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ నర్సింగరావు అభినందనలు తెలిపారు. కేంద్రం, రాష్ట్రంలో ఏ ప్రభుత్వాలు వచ్చినా స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామన్న నిర్ణయాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, ఎం రాజశేఖర్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఎదుర్కొంటున్న సమస్యలకు స్థానిక యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే కారణమని విమర్శించారు. స్టీల్ యాజమాన్యం తీసుకున్న నిర్ణయాలను కాగ్ నివేదికలు తప్పు పట్టినా.. కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్థాల సరఫరా ఒప్పందాలను తుంగలో తొక్కి ఏకపక్ష నిర్ణయాల ద్వారా ప్లాంట్‌ను నష్టాల్లోకి నెడుతున్నారని పేర్కొన్నారు. దీక్షల్లో స్టీల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ, నాయకులు శ్రీనివాస్, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఎన్.రామారావు, కెఎస్ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, వైటి.దాస్, విళ్లా రామ్మోహన్ కుమార్, బొడ్డు పైడిరాజు, శ్రీనివాసులు నాయుడు, నమ్మి సింహాద్రి, గుమ్మడి నరేంద్ర, శ్రీనివాస్, పుల్లారావు పాల్గొన్నారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

గుంటూరు-సికింద్రాబాద్ మార్గంలో పలు రైళ్లకు అంతరాయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



నల్లగొండ జిల్లాలో ఆదివారం గూడ్స్ రైలు బోగీలు పట్టాలు తప్పడంతో ఆ మార్గంలో రైళ్లను నిలిపివేశారు. దీంతో ప్రయాణికుల నానా ఇబ్బందులు పడ్డారు. ఈ ఘటనపై అధికారులు తెలిపిన వివరాల మేరకు... నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గంలోని దామరచర్ల మండలం విష్ణుపురం జంక్షన్ వద్ద ఆదివారం మధ్యాహ్నం సికింద్రాబాద్ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న గూడ్స్ రైలు బోగీలు పట్టాలు తప్పాయి. విష్ణుపురం రైల్వేస్టేషన్‌కు కూతవేటు దూరంలో లూప్ లైన్ నుంచి మెయిల్ లైన్‌కు చేరే క్రాసింగ్ వద్ద ఇంజన్ నుంచి 4, 5 నెంబర్ బోగీలు పక్కకు ఒరిగిపోయాయి. ఈ సంఘటనతో అప్రమత్తమైన లోకో పైలట్ రైలును నిలిపివేశారు. గూడ్స్ రైలు కావడం, రైలు తక్కువ స్పీడ్‌లో ఉండడంతో ఎలాంటి ప్రాణనష్టమూ జరగలేదు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. రైల్వే అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని యుద్ధ ప్రాతిపదికన రైల్వే మార్గాన్ని మరమ్మతులు చేపట్టారు. ఈ మార్గంలో ప్రయాణించే సికింద్రాబాద్ నుంచి కేరళ వైపు వెళ్లే శబరి ఎక్స్‌ప్రెస్‌ను మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో, విశాఖ నుంచి సికింద్రాబాద్ వచ్చే జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను పల్నాడు జిల్లా పిడుగురాళ్ల వద్ద, మిగిలిన రైళ్లను వేర్వేరు స్టేషన్లలో నిలిపివేశారు. గంటల తరబడి నిలిచిపోయిన ప్యాసింజర్ రైళ్లలో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు రైళ్లు నిలిచిపోవడంతో ప్రయాణికులు మంచినీరు, ఆహారం కోసం అల్లాడారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు.. ఎండ వేడిమి, ఉక్కపోతతో యాతన పడ్డారు.

మానవత్వం చాటిన ఎమ్మెల్యే బిఎల్ఆర్

మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో నిలిచిపోయిన శబరి ఎక్స్‌ప్రెస్‌లో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులకు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) తమ ఫౌండేషన్ సభ్యులతో కలిసి ఆహార పదార్థాలు, వాటర్‌బాటిళ్లు అందజేశారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. రైల్వేమార్గాన్ని యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించి, ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

పక్షపాతం చూపిన ఇసి, పోలీస్

- మాజీ మంత్రి పేర్ని నాని


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎలక్షన్ కమిషన్, పోలీస్‌శాఖ టిడిపికి అనుకూలంగా వ్యవహరించాయని మాజీ మంత్రి పేర్ని నాని విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికల హింస జరగడానికి ఎన్నికల కమిషన్, పోలీసులే కారణమని ఆరోపించారు. కారంపూడి ఘటనలో టిడిపి కార్యకర్తలు మారణాయుధాలతో దాడులకు వస్తున్నారని సమాచారం వున్నా, గొడవలను నివారించకుండా పోలీసులు అక్కడ నుండి వెళ్లిపోవడం ఏమిటని ప్రశ్నించారు. కారంపూడిలో వైసిపి నేతల ఇళ్లు, వ్యాపార సంస్థలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నా.. పోలీసులు నిరోధించలేక పోయారన్నారు. పోలింగ్ తర్వాత కూడా టిడిపి అరాచకాలకు తెగబడిందని విమర్శించారు. రాష్ట్రంలో పోలీసు అధికారులు బరితెగించి ప్రవర్తిస్తున్నారని అన్నారు. కొన్ని ప్రాంతాల్లో వైసిపికి ఓటు వేయకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈ హింసపై పల్నాడు ఎస్‌పికి ఫోన్ చేసినా స్పందించలేదన్నారు. పాల్వాయి గేటు ఘటనలో అడిషనల్ ఎస్‌పి సుప్రజ అక్కడే వున్నా.. హింసను నివారించలేకపోయారని అన్నారు. రహస్యంగా వుండాల్సిన వీడియో బయటకు వెళ్లినా ఎన్నికల కమిషన్ తమ ఆఫీసు నుండి వెళ్లలేదని బాధ్యత లేకుండా ప్రకటన చేసి ఊరుకుందన్నారు. రాష్ట్రంలో ఇసి సిఫార్సులతో నియమించిన అధికారులంతా టిడిపి కోసమే పనిచేశారని విమర్శించారు.

2తో ముగియనున్న గడువు

- విభజన ఒప్పంద కాలం సమాప్తం
- కోర్టుల్లోనూ కేసులు
- ఇక నుండి 2 రాష్ట్రాల సమస్యలు కేంద్రం పరిధిలోకి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్ర విభజన అనంతరం కేంద్రం ఇచ్చిన విభజన హామీలకు జూన్ 2తో గడువు తీరనుంది. ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ ఇక నుండి తెలంగాణకు పరిమితం కానుంది. అక్కడ ఎపికి చెందిన భవనాలనూ తెలంగాణ ప్రభుత్వానికి కేటాయించనున్నారు. వాటికి సంబంధించిన వివరాలతో నివేదిక తయారు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలోనే సాధారణ పరిపాలనశాఖ అధికారులను ఆదేశించారు. ఉమ్మడి గడువు తీరనున్న తేదీ దగ్గరపడుతున్నా 9, 10 షెడ్యూలులోని ఫిల్మ్ డెవలప్‌మెంట్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎన్‌టిపిసి, ఎపి భవన్, ఆర్‌టిసి, సింగరేణి, ఆస్తులకు సంబంధించిన అంశాలు పూర్తిగా తేల్చలేదు. కొన్ని భవనాలను కొలతలు తీసి, సరిహద్దులు నిర్ణయించినా పూర్తి కేటాయింపులు జరగలేదు. రాజధాని అంశాన్ని తేల్చకపోవడంతో ఇప్పటికీ ఉద్యోగులు హైదరాబాద్, విజయవాడ చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఇటీవల కొన్ని కార్యాలయాలను కర్నూలులో ఏర్పాటు చేసినా ఆర్థికపరమైన అంశాలపై క్లారిటీ రాలేదు. పార్లమెంటు ఎన్నికలు జరిగిన నేపథ్యంలో రెండో తేదీతోనే విభజన చట్టాన్ని ముగించేస్తారా? లేక కొత్త ప్రభుత్వం ఏర్పాటయిందాకా ఆగుతారా? అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. విద్యుత్‌కు సంబంధించిన ఆర్థిక లావాదేవీల అంశం సుప్రీంకోర్టులో పెండింగ్ ఉంది. కేసు పెండింగ్‌లో ఉండగా విభజన హామీల అంశాన్ని పూర్తి చేస్తారా? లేక కోర్టు కేసు తేలే వరకూ ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను కొనసాగిస్తారా? అనే అంశంపై స్పష్టత లేదు. మరోవైపు ఎపికి చెందిన ఉద్యోగులు తెలంగాణలో 1,200 మంది వరకూ ఉన్నారు. ఇక్కడ నుండి అక్కడకు వెళ్లాల్సిన ఉద్యోగులు 1,600 మందికిపైగా ఉన్నారు. మూడేళ్ల క్రితం దీనిపై రెండు ప్రభుత్వాల మధ్య సానుకూల చర్చలు జరిగాయి. ఒకట్రెండు రోజుల్లో ఉద్యోగుల మార్పిడి ఒప్పందం జరుగుతుందని అనుకుంటున్న సమయంలో అక్కడి ప్రభుత్వం వెనక్కు తగ్గింది. దీంతో ఆ అంశం పెండింగులో ఉంది. విద్యుత్ బకాయిలకు సంబంధించి రూ.8 వేల కోట్ల అంశం ఇంకా తేల్చలేదు. దీనిపై సిఎం జగన్ గానీ, గత సిఎం చంద్రబాబు గానీ పూర్తిగా తేల్చకుండా నాన్చుడు ధోరణితో వ్యవహరించారు. పదేళ్లపాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానితోపాటు, రెండు రాష్ట్రాల మధ్య సమస్యలు కూడా పదేళ్లలో పరిష్కరించుకోవాలి. లేనిపక్షంలో పరస్పర అంశాల వ్యవహారం కేంద్రం పరిధిలోకి వెళ్లిపోతుంది. ఇప్పుడు ఇదో పెద్ద సమస్యగా మారింది. పెండింగ్‌లో ఉన్న సుమారు ఎనిమిది రంగాలకు సంబంధించిన అంశాలు ఇక నుండి కేంద్ర పర్యవేక్షణలోకి వెళ్లనున్నాయి.

వారి అడ్రస్ వేరే రాష్ట్రంలో..

ఇప్పటి వరకూ రాష్ట్రానికి చెందిన ఎక్కువ మంది ప్రజాప్రతినిధుల అడ్రస్ హైదరాబాద్‌గానే ఉంది. సాయంత్రం అక్కడకు వెళ్లడం, ఉదయం ఇక్కడకు రావడం పనిగా పెట్టుకున్నారు. వ్యాపార లావాదేవీలు, కంపెనీల అడ్రస్‌లన్నీ హైదరాబాద్ కేంద్రంగానే నడుస్తున్నాయి. కుటుంబాలు, పిల్లల చదువులు అన్నీ దాంతోనే ముడిపడి ఉన్నాయి. జూన్ రెండు లేదా కొత్త ప్రభుత్వం వచ్చి పార్లమెంటు చేసిన ఒప్పందం ప్రకారం నిర్ణయం తీసుకుని హైదరాబాద్‌ను తెలంగాణకు అప్పగించేస్తే ఇప్పుడు ఎపిలో ఉన్న అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకుల అడ్రస్‌లన్నీ వేరే రాష్ట్రంలోనే ఉండనున్నాయి. జూన్ రెండు తరువాత ఇదే కీలక అంశంగా ముందుకు రానుంది.

సైన్స్‌తోనే సమాజ పురోగతి

- విజ్ఞాన దర్శిని, టిపిఎస్‌కె మహిళా వైజ్ఞానిక శిక్షణలో వక్తలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సమాజ పురోగతి సైన్స్‌తోనే సాధ్యమని, దాని ద్వారా సమాజంలోని మూఢనమ్మకాలను తిప్పికొట్టాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. డిగ్రీ, పిజి, పిహెచ్‌డి పట్టాలెన్నిపొందినా శాస్త్రీయ దృక్పథంతో ముందుకెళ్లకుండా మూఢత్వాలను నమ్మితే ఆ చదువులు వ్యర్థమన్నారు. భయమే బాణామతి అనీ, పిరికితనమే చేతబడి అని చెప్పారు. మహిళలు చైతన్యమై శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొదించుకోవాలనీ, అలాగైతే కుటుంబాన్ని, సమాజాన్ని మార్చే అవకాశముంటుందని నొక్కి చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విజ్ఞాన దర్శిని, టిపిఎస్‌కె సంయుక్త ఆధ్వర్యంలో మాయలు, మహిమల గుట్టురట్టు చేసేలా మహిళలకు వైజ్ఞానిక వర్క్‌షాపును నిర్వహించారు. బాబాలు, స్వామీజీలు ప్రజలను మూఢత్వంలో ముంచి ఉంచడానికి చేస్తున్న మాయలు, మహిమలను గుట్టురట్టు చేశారు. మహిళలు, చిన్న పిల్లలతో మండుతున్న హారతికర్పూర బిల్లలను చేతిలో, నాలుకపై వెలిగించడం, సలసలకాలుతున్న నూనె నుంచి వేడివేడి బజ్జీలను తీయడం, నిప్పులపై నడవడం, మంటలతో ఆటలాడటం, నిమ్మకాయలతో గారడీ చేయడం, గాజుపెంకులపై నడవటం లాంటి 60 రకాల సైన్స్ విన్యాసాలను చేయించారు. వాటిలో దాగి ఉన్న సైన్స్‌ను విజ్ఞాన దర్శిని అధ్యక్షులు రమేశ్ వివరించారు.

బాబాలు, స్వామీజీలు చేస్తున్న మోసాలను ఎండగట్టారు. మహిళల కోసం ప్రత్యేకంగా వర్క్‌షాపు పెట్టాల్సి వచ్చిన ఆవశ్యకతను వివరించారు. నిమ్మకాయ, పసుపు, కుంకుమ ఇంటిముందు వేసిపోతే చాలు భయపడే తత్వం ప్రజల్లో పెరిగిందన్నారు. మాయలు, మంత్రాలు లేవని స్పష్టం చేశారు.

మూఢత్వంలో మునిగిపోతే సమాజ అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. మహిళల్లో మూఢత్వం ఉంటే పిల్లలపైనా, కుటుంబంపైనా రుద్దే ప్రమాదం ఉందన్నారు. సావిత్రీబాయి పూలే మహిళ విద్య అభివృద్ధి కోసం చేసిన కృషిని కొనియాడారు. కరోనా సమయంలో ఏ మాయ మంత్రాలు పనిచేయలేదనీ, ప్రజల ప్రాణాలను కాపాడింది డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, పారిశుధ్యకార్మికులు అని ప్రశంసించారు. మూత్రం తాగే స్థితికి మూఢత్వం దిగజారుస్తున్న తీరును వివరించారు. ఉన్నత విద్యను అభ్యసించిన వారు మూఢత్వాలను నమ్మడం దుర్మార్గమన్నారు. ప్రజలను విజ్ఞానవంతులను చేసేందుకు, శాస్త్రీయ ఆలోచనల దిశగా అడుగులు వేయించేందుకు తమ విజ్ఞాన దర్శిని కృషి చేస్తోందన్నారు. టిపిఎస్‌కె అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సంఘపరివార్, అసాంఘిక శక్తులు మూఢనమ్మకాలను, విశ్వాసాలను ప్రజలపై బలవంతంగా రుద్దుతున్న తీరును వివరించారు. పసిహృదయాల్లో విషపూరిత ఆలోచనలను నింపుతున్న తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత చదువులు చదువుతున్న కొద్దీ విజ్ఞానం పెరిగి మూఢత్వ భావనలు తగ్గిపోవాలనీ, కానీ, దేశంలో అవి పెరిగిపోతున్నాయని వాపోయారు. ప్రతిఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ప్రతిభాలక్ష్మి మాట్లాడుతూ..అజ్ఞానం రాజ్యమేలుతున్న ప్రస్తుత తరుణంలో విజ్ఞానానికి పునాదులు వేయాల్సిన అవసరముందని నొక్కిచెప్పారు. ప్రశ్నించే తత్వం ప్రజల్లో పెరగాల్సిన అవసరముందన్నారు. సైన్స్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. వర్క్‌షాపులో అమ్మ నేత్ర శరీర అవయవ దాన అధ్యక్షులు ఈశ్వరలింగం, విజ్ఞానదర్శిని కోశాధికారి తులసీరామ్, శోభారాణి, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.



వైజ్ఞానిక వర్క్‌షాపులో పాల్గొన్న వక్తలు, మహిళలు

లోకేష్‌కు టిడిపి పగ్గాలు?

- పార్టీలో పెరుగుతున్న డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి పగ్గాలు లోకేష్‌కు అప్పగిస్తారనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న లోకేష్‌కు ఎన్నికల ఫలితాల తర్వాత బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని తెలిసింది. టిడిపి అధికారంలోకి వస్తుందని, చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని, లోకేష్‌కు పార్టీ బాధ్యతలు అప్పగించాలని ఇటీవల ఓ మాజీ ఎమ్మెల్సీ ప్రతిపాదన ముందుకు తీసుకొచ్చారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు పార్టీ, కార్యకర్తల గురించి పట్టించుకోలేదనే అసంతృప్తి నేతల్లో ఉంది. 2014 నుంచి టిడిపిలో క్రియాశీలకంగా వ్యవహరించిన లోకేష్ కూడా పార్టీ కార్యక్రమాలను విస్మరించారనే కొంత అసహనం కిందిస్థాయి నాయకుల్లో ఉంది. పార్టీ కార్యకర్తలను పట్టించుకోకపోవడం వల్లే 2019 ఎన్నికల్లో పార్టీ 23 శాసనసభ, మూడు లోక్‌సభ సీట్లకే పరిమితం కావాల్సి రావడం, రాజ్యసభలోనూ పార్టీ ప్రాతినిధ్యం లేకుండాపోయిందనే ఆందోళన వారిలో నెలకొంది. ఓటమి తరువాత కొద్దికాలం చంద్రబాబు సైలెంటుగా ఉండటంతో పార్టీ బాధ్యతలన్నీ లోకేష్ చూశారు. ఎన్నికల్లో ఓడిపోయిన వ్యక్తికి పార్టీ బాధ్యతలు అప్పగించడం మంచిది కాదనే కోణంలో కొంతమంది సీనియర్లు బేదాభిప్రాయాలు వ్యక్తం చేశారు. దీంతో పార్టీ అధ్యక్షులుగా చంద్రబాబు, ప్రధాన కార్యదర్శిగా లోకేష్ గత మూడేళ్లుగా వేర్వేరు కార్యక్రమాలతో రాష్ట్రవ్యాప్త పర్యటనలు నిర్వహించారు. లోకేష్ నిర్వహించిన 'యువగళం' పాదయాత్ర కార్యకర్తలకు ఉత్సాహాన్నిచ్చిందని టిడిపి నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



గల్లంతైన వారి ఆచూకీ కోసం శిథిలాలను తొలగిస్తున్న స్థానికులు

చిన్న దేశానికి అతి పెద్ద విపత్తు

- పపువా న్యూ గినియాలో భారీగా విరిగిపడ్డ కొండచరియలు
- 670 మందికి పైగా సజీవ సమాధి

న్యూయార్క్ : దక్షిణ పసిఫిక్ ప్రాంతంలోని చిన్న దేశమైన పపువా న్యూ గినియా నేడు అతిపెద్ద విపత్తులోచిక్కుకుంది. రెండు రోజుల క్రితం భారీగా కొండచరియలు విరిగిపడడంతో 670 మందికిపైగా అభాగ్యులు సజీవ సమాధి అయిపోయారు. ఐక్యరాజ్య సమతికి చెందిన వలసవాసుల సహాయ పునరావాస సంస్థ చీఫ్ సెర్హాన్ అక్టో ప్రాక్ ఆదివారం ఈ విషయం వెల్లడించారు. ఎన్గా ప్రావిన్స్‌లోని యంబల్లి, కొవోకలం గ్రామాలకు చెందిన వందలాది ఇళ్లు విరిగిపడ్డ కొండచరియల కింద పూర్తిగా కప్పబడిపోయాయని అయన తెలిపారు. సమాధి అయినవారంతా యుద్ధాలు, ఘర్షణల్లో నిరాశ్రయులై శరణార్థులుగా ఈ ప్రాంతానికి వచ్చిన వారే. దాదాపు నాలుగు వేల మంది ఈ ప్రాంతంలో నివసిస్తున్నారు. ఎనిమిది మీటర్ల ఎత్తున మట్టి, రాళ్లు పేరుకుపోవడంతో ప్రాణ నష్టం అంచనాలకు అందడం లేదు. తొలుత 60 ఇళ్లు సమాధి అయ్యాయని అంచనా వేశారు. ఆ ప్రకారం 150 మంది చనిపోయినట్లు అధికారులు అంచనా వేశారు.. కానీ, క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పరిశీలిస్తే సమాధి అయిన ఇళ్ల సంఖ్య, అలాగే మృతుల సంఖ్య అనేక రెట్లు పెరిగిపోయాయి. 'ప్రస్తుతం 670 మందికి పైగా జనం శిథిలాల కింద సమాధి అయినట్లు అక్టోప్రాక్ మీడియాకు తెలిపారు. ఆదివారం సాయంత్రానికి కేవలం ఆరుగురు మృతదేహాలను మాత్రమే వెలికితీశారు. ఇప్పటికీ రాళ్లు పై నుంచి దొర్లుతూనే ఉన్నాయి. 200 కి.మీ పొడవునా రోడ్డు కప్పబడడంతో సహాయక చర్యలు చేపట్టడం కష్టమవుతోందని అక్టో ప్రాక్ చెప్పారు.పపువా న్యూ గినియా రాజధాని పోర్ట్ మోర్స్బీకి 600 కిలోమీటర్ల దూరంలోని ఎన్గా ప్రావిన్స్‌లో స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారు జామున 3 గంటలకు ప్రజలు గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకోవడంతో వారంతా నిద్రలోనే మృత్యువు ఒడిలోకి జారుకున్నారు. పెద్ద విపత్తులో చిక్కుకున్న పపువా న్యూగినియాను ఆదుకునేందుకు భారత్ అత్యవసర సహాయం కింద పది లక్షల డాలర్లు ప్రకటించింది.

ఉపాధ్యాయుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో, రాయచోటి (అన్నమయ్య జిల్లా)



జయప్రకాశ్ నారాయణ (ఫైల్)

మన రాష్ట్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తెలంగాణలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. హైదరాబాద్‌లోని మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. తెలంగాణ పోలీసుల కథన ప్రకారం... మన రాష్ట్రంలోని అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన శ్రీనివాస్, సరస్వతి దంపతులకు కుమారుడు జయప్రకాశ్ నారాయణ (35), కుమార్తె ప్రశాంతి ఉన్నారు. కూకట్‌పల్లి బాలాజీ నగర్‌లో ఉంటున్న తన సోదరి ప్రశాంతి ఇంటికి ఈ నెల 22న జయప్రకాష్ నారాయణ వచ్చారు. తన ఊరికి వెళ్తున్నానని చెప్పి శనివారం ఉదయం ఆయన బయలుదేరారు. రాత్రయినా ఇంటికి చేరలేదు. దీంతో, కుటుంబ సభ్యులు కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మియాపూర్ మదీనాగూడలోని ఫ్లాగ్‌షిప్ ఓయో వెన్నెల రెసిడెన్సీ లాడ్జిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు హోటర్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ మృతదేహం జయప్రకాశ్‌దిగా నిర్ధారణ అయిందని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని, ఇది ఆత్మహత్య? హత్య? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని మియాపూర్ పోలీసులు తెలిపారు. రాయచోటిలోని కొత్తపేటలో జయప్రకాశ్ నారాయణ నివాసం ఉంటున్నారు. కెవి పల్లి మండలం జిల్లెలమంద పంచాయతీ పరిధి పెదతాండ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు.



బీచ్ రోడ్డుపైకి ఎగసిపడుతున్న సముద్రపు అలలు

ఉప్పాడలో సముద్రం అల్లకల్లోలం

- తీరాన్ని తాకుతున్న రాకాసి అలలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి(కాకినాడ జిల్లా)

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను నేపథ్యంలో కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. రాకాసి అలలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి. బీచ్‌రోడ్డుపైకి అలలు రావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉప్పాడ నుంచి కాకినాడ వెళ్లే బీచ్ మార్గంలో ఉన్న నేల వంతెన వద్ద సముద్రపు అలల ఉధృతి మరింత ఎక్కువగా ఉంది. ఇక్కడ అలలు ఎగసిపడటంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. వంతెన పైనుంచి వెళ్తున్న సమయంలో అలలు వస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సముద్రం ఉధృతి దృష్ట్యా బీచ్‌రోడ్డుపై రాకపోకలను నిలిపేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్‌టిసి ఉద్యోగుల హక్కులపై దాడి ఆపాలి

- ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుందరయ్య అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయాలి
- కార్మిక, ఉద్యోగ, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్



రౌండ్‌టేబుల్ సమావేశంలో నినదిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు

ఆర్‌టిసి ఉద్యోగుల ప్రజాస్వామిక హక్కులపై దాడి ఆపాలని, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుందరయ్య అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆర్‌టిసిలో అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన ఏలూరు ఎన్‌ఆర్‌పేటలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య అధ్యక్షతన సమావేశంలో ఎపిఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు, జెఎసి జిల్లా ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పరిధిలో లేని అంశాన్ని ఆధారంగా చేసుకుని ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్యను సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని తెలిపారు. చిన్నచిన్న కారణాలతో ఉద్యోగులను సస్పెండ్ చేయడం సరికాదన్నారు. ఉద్యోగులపై వేధింపులు ఆపకపోతే కార్మిక, ఉద్యోగ సంఘాలు ఉద్యమించక తప్పదని స్పష్టం చేశారు. ఎఐటియుసి జిల్లా నాయకులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలపై మాట్లాడటం మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌కు విరుద్ధం కాదని వివరించారు. అక్రమంగా సస్పెండ్ చేయడం ఉద్యోగుల హక్కులపై దాడి తప్ప మరొకటి కాదన్నారు. సుందరయ్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆర్‌టిసి యాజమాన్యం కార్మికుల నిరసన ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు అమలులో ఉండగా ఎన్నికల కోడ్ పేరుతో ఆర్‌టిసి యాజమాన్యం ఎలా చర్యలు తీసుకుంటుందని ప్రశ్నించారు. సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాధరావు మాట్లాడుతూ ఆర్‌టిసి అధికారులు ఉద్యోగులపై వేధింపులు ఆపాలని హెచ్చరించారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు కె.విజయలక్ష్మి, వ్యకాస జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి, ఆటో యూనియన్ జిల్లా నాయకులు జె.గోపి, కుమార్, ఎపిఎంఎస్‌ఆర్‌యు రాష్ట్ర కార్యదర్శి వివిఎస్.ప్రసాద్ తదితరులు ప్రసంగించారు. సుందరయ్య అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

పిహెచ్‌సిలలో ప్రసవాల పెంపునకు చర్యలు

- వైద్యారోగ్యశాఖ కమిషనరు ఎస్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు పెంచేందుకు వైద్యారోగ్యశాఖాధికారులు దృష్టిపెట్టాలని, ప్రసవాలు నిర్వహించని పిహెచ్‌సిలపై చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ కమిషనరు ఎస్ వెంకటేశ్వర్ ఆదేశించారు. పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ల పనితీరును మెరుగుపరచుకోవాలని సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అతి తక్కువ ప్రసవాలు జరిగిన పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టరు పద్మావతిని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో జీరో ప్రసవాలు ఏమాత్రం ఉండకూడదని చెప్పారు. బిసిజి టీకాల విషయంలో వెనుకబడిన గుంటూరు, విశాఖపట్నం జిల్లాల్లో సంబంధిత అధికారులు విధినిర్వహణ తర్వాత పనితీరుని సరిదిద్దుకోవాలని, ప్రచార సాధనాలు, పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్ర సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించి బిసిజి టీకాలు వేయాలని, జర్నలిస్టులకు కూడా ఈ టీకా వేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మలేరియా, డెంగీ, చికున్ గున్యా ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రానున్న నాలుగు నెలలూ మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందన్నారు. గిరిజన ప్రాంతాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో డెంగీ కేసులు పెరగకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కమిషనరు వెంకటేశ్వర్ ఆదేశించారు.

12న స్కూల్ బ్యాగుల పంపిణీ

- పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యాకానుక కిట్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే స్కూల్ బ్యాగులను జూన్ 12న అందిస్తామని పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నోయిడాలోని బ్యాగుల తయారీ ఫ్యాక్టరీని ఆదివారం ఆయన సందర్శించారు. జూన్ 5 నాటికి బ్యాగులను తమకు సరఫరా చేస్తామన్న కంపెనీ నిబద్ధత ఆకట్టుకుందన్నారు.

స్థల వివాదంపై ఘర్షణ

- ఒకరు మృతి



ప్రజాశక్తి - నార్పల

స్థలం విషయంలో ఘర్షణపడుతున్న ఇద్దరిలో ఒకరు మృతి చెందిన ఘటన అనంతపురం జిల్లా నార్పల మండల పరిధిలోని జంగం రెడ్డిపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి మృతుని బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొవ్వూరు లక్ష్మీనారాయణ రెడ్డి (56) తన పొలంలో చీనీ పంట సాగు చేస్తున్నారు. పంటకు నీరు సరిపోవడంలేదని పొలానికి దాదాపు కిలోమీటరు దూరంలో ఉన్న దుగుమర్రి చెరువు వద్ద నాలుగురోజుల క్రితం బోరుబావిని తవ్వించారు. అందులో నీరు పుష్కలంగా లభించడంతో మోటరు ఏర్పాటు చేసి పైప్‌లైన్ పనులను ఆదివారం చేపట్టారు. అదే సమయంలో తుంపెర మిద్దెల గ్రామానికి చెందిన మంజుల రమణ ఈ స్థలం తనదంటూ పైప్‌లైన్ పనులకు అడ్డుపడ్డాడు. ఇది ప్రభుత్వ భూమి అని లక్ష్మీనారాయణరెడ్డి సమాధానమిచ్చాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య వాదోపవాదాలు పెరిగి ఘర్షణకు దారితీశాయి. ఈ సమయంలో జరిగిన తోపులాటలో లక్ష్మీనారాయణరెడ్డి కిందపడి స్పృహతప్పారు. వెంటనే నార్పల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సిఐ శ్రీధర్, ఎస్‌ఐ రాజశేఖర్ రెడ్డి తమ సిబ్బందితో ఆస్పత్రికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని కుమారుడు కుల్లాయి రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని డిఎస్‌పి వెంకటశివారెడ్డి తెలిపారు.



కిశోర్ చంద్రదేవ్‌ను కలిసిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఇతర నేతలు

కిశోర్ చంద్రదేవ్‌తో సిపిఎం నేతల భేటీ

ప్రజాశక్తి- కురుపాం (పార్వతీపురం మన్యం జిల్లా)

కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిశోర్ చంద్రదేవ్‌ను కురుపాంలోని ఆయన నివాసంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదిక బలపర్చిన సిపిఎం ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థులకు మద్దతు ప్రకటించినందుకు దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కిశోర్ చంద్రదేవ్... కౌంటింగ్ రోజు ఏజెంట్లు నిర్వహించాల్సిన బాధ్యతలు, విధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. అనంతరం ఇరువురూ దేశ, రాష్ట్ర రాజకీయాలపై చర్చించుకున్నారు. కిశోర్ చంద్రదేవ్‌ను కలిసిన వారిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, కె.సుబ్బరావమ్మ, అరకు పార్లమెంటు నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స, కురుపాం నియోజకవర్గ సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ ఉన్నారు.

ప్రైవేటు బస్సు ఢీకొని భార్యాభర్తల దుర్మరణం

ప్రజాశక్తి - విజయవాడ

ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొని భార్యాభర్తలు దుర్మరణం పాలైన సంఘటన ఆదివారం రాత్రి విజయవాడ బస్టాండ్ సమీపంలో జరిగింది. విజయవాడ కృష్ణలంక సిఐ మురళీకృష్ణ కథనం ప్రకారం... విజయవాడ సమీపంలోని ఎనికేపాడులో గల ఓ బట్టల గోడౌన్లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన షేక్ మున్నీర్ బాషా (59), ఆయన భార్య జరీనా (55) ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై ప్రకాశం బ్యారేజి మీదుగా సీతానగరం వైపు నుండి విజయవాడ వైపు వస్తున్నారు. నగరంలోని రాజీవ్‌గాంధీ పార్క్ సమీపంలోకి రాగానే దుర్గగుడి ఫ్లైవోవర్ మీదుగా విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌వైపు వస్తున్న ఎపి 37 పిఎ 5805 నెంబరు గల లోకల్ ట్రావెల్స్ బస్సు వెనుక నుండి ఢీకొంది. దీంతో భార్యాభర్తలు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కృష్ణలంక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రాజులోవ మృతి తీరని లోటు

- సంతాప సభలో వక్తల నివాళి
- ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి- రౌతులపూడి (కాకినాడ జిల్లా)

సిఐటియు తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులోవ మృతి తీరని లోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం మృతి రాజులోవ అంత్యక్రియలు కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం ములగపూడిలో ఆదివారం జరిగాయి. అనంతరం సిపిఎం కాకినాడ జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ లోవరాజు విద్యార్థి దశ నుంచి ఎస్‌ఎఫ్‌ఐ పట్ల ఆకర్షితులై అంచెలంచెలుగా ఎదిగి పార్టీకి సేవలందించారన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీలో మంచి గుర్తింపు తెచ్చుకున్న రాజులోవ చిన్న వయస్సులోనే మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి సిపిఎం రాష్ట్ర కమిటీ తరపున సంతాపం తెలిపారు. సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులు జి.బేబిరాణి మాట్లాడుతూ రాజులోవ మృతి కార్మిక లోకానికి తీరని లోటన్నారు. డివైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము మాట్లాడుతూ రాజులోవ డివైఎఫ్‌ఐలోనూ చురుగ్గా పనిచేశారన్నారు. అంత్యక్రియల్లో సిపిఎం తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి అరుణ్, విజయవాడ ఎంబివికె బాధ్యులు టి.క్రాంతి, సిఐటియు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు సుందర్‌బాబు, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, రాజులోవ కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాజులోవ మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. లోవరాజు కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు.

బయటపడుతున్న పిన్నెల్లి అరాచకాలు

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడి అరాచకాలు ఒక్కొక్కటి బయటపడుతున్నాయని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. ఆయన బాధితులు ఒక్కొక్కరు బయటకు వచ్చి గొంతు వినిపిస్తున్నారని తెలిపారు. పిన్నెల్లి సొంత గ్రామం కండ్లకుంటలో నోముల మాణిక్యాలరావుపై దాడి చేశారని అన్నారు. టిడిపి కార్యాలయంలో మాణిక్యాలరావుతో కలిసి ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బూత్ ఏజెంటుగా కూర్చున్న దళిత బిడ్డ మాణిక్యాలరావుపై పిన్నెల్లి కులం పేరుతో నానా దుర్భాషలాడి దాడి చేశారని విమర్శించారు. మరో ఏజెంట్ దుర్గంపూడి వెంకటరెడ్డితో పాటు తన కుమారులపై కూడా దాడి చేశారని, అడ్డుకోబోయిన అతని బిడ్డను వివస్త్రను చేశారని ఆరోపించారు. పిన్నెల్లి సోదరుల అరాచకాలపై డిజిపి, ఎన్నికల కమిషన్ దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రాణ భయంతో తాను హైదరాబాద్ పారిపోయానని మాణిక్యాలరావు అన్నారు. పిన్నెల్లి సోదరులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాణిక్యాలరావుతో కలిసి వర్ల రామయ్య డిజిపిని సాయంత్రం కలిసి ఫిర్యాదు చేశారు.

పిన్నెల్లిపై మరో మూడు కేసులు

- ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో అత్యవసర పిటీషన్
- కేసుల వివరాలు అందజేయాలన్న హైకోర్టు
- విచారణ సోమవారానికి వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

ఇవిఎంల ధ్వంసం కేసులో హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసిన తర్వాత పోలీసులు మూడుచోట్ల కేసులు నమోదు చేయడాన్ని మాచర్ల ఎమ్మెల్యే, వైసిపి అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హైకోర్టులో సవాల్ చేశారు. ఈ కేసుల్లో తనకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలన్న అత్యవసర పిటీషన్ ఆదివారం జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప్ తన ఇంటి వద్ద విచారణ చేపట్టారు. పిటిషనర్‌ను అరెస్ట్ చేసి తీరాలన్న తలంపుతో పోలీసులు, డిజిపి ఉన్నారని సీనియర్ అడ్వకేట్ టి. నిరంజన్‌రెడ్డి వాదించారు. ఎన్నికల కమిషన్ తీరు దారుణంగా ఉందని, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని చెప్పారు. ఇదే హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసిన తెల్లారేలోపు పిటిషనరుపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారని, తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తి ఫిర్యాదు చేసిన పది రోజులకు పోలీసులు కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా పరిగణించాలని కోరారు. పోలీసులు వేరువేరుగా నమోదు చేసిన కేసులన్నీ ఎన్నికలకు సంబంధించినవేనని చెప్పారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించాల్సి ఉండగా ప్రత్యేకంగా న్యాయవాదిని నియమించడాన్ని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇవిఎంలను ధ్వంసం చేశారన్న అభియోగాల కేసులో జూన్ ఆరో తేదీ వరకు ముందస్తు బెయిలు మంజూరు చేసినట్టుగానే ఈ కేసుల్లోనూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పిపి) యర్రంరెడ్డి నాగిరెడ్డి వాదిస్తూ, తీవ్ర నేరాలకు పాల్పడినందున మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయవద్దని కోరారు. కౌంటింగ్ నాడు అల్లర్లు సృష్టించే అవకాశం ఉందన్నారు. హైకోర్టు ముందస్తు బెయిలు మంజూరు చేయడానికి ఒకరోజు ముందే ఈ కేసులు నమోదయ్యాయని చెప్పారు. హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసిన తర్వాత రోజునే కేసులు నమోదయ్యాయని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. వాదనలు అనంతరం హైకోర్టు.. క్రైమ్ నెంబర్ 50లో పిటిషనర్ పిన్నెల్లిని పోలీసులు ఎప్పుడు నిందితుడిగా చేర్చారో ఆ కేసు వివరాలను నివేదించాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్

రిజిస్టర్డు ఆఫీసు: 27బికెసి, సి-27, జి-బ్లాక్, బంద్ర కుర్ల కాంప్లెక్స్, బంద్ర (ఈస్ట్), ముంబయి-400051.
బ్రాంచి ఆఫీసు: కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్, 6-3-1109/1, 2వ అంతస్తు, వెస్ట్ వింగ్, జెవెల్ పావని టవర్స్, రాజ్‌భవన్ రోడ్, సోమాజిగూడ, హైదరాబాద్, తెలంగాణ-500082.

స్వాధీనతా ప్రకటన

ఏదైతే, క్రింది సంతకందారు, **కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్,** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఇందు దిగువ వివరించినట్లు రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసులు జారీచేసి, దాని స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా చెల్లించు వాస్తవ తేదీ వరకు అన్ని ఖర్చులు, చార్జీలు& వ్యయాలతో సదరు నోటీసుల్లో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా సదరు రుణగ్రహీతలను కోరబడినది. సదరు రుణగ్రహీత/లు/ సహ-రుణగ్రహీతలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలుకు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని క్రింది సంతకందారు ఇందు దిగువ వివరించిన ఆస్తిని తేదీన **స్వాధీనంచేసుకున్నారు.** ప్రత్యేకించి ఇందు పై పేర్కొన్న రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలు/ హామీదారులు/తాకట్టుదారు మరియు సర్వజనులను ఇందుమలూంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్**కు సదరు తేదీల నుండి తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు చార్జీలతో దానిలో సూచించిన మొత్తాలను చెల్లించుటకులోబడి ఉంటుంది. రుణగ్రహీత సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది. రుణగ్రహీతల, షెడ్యూలు ఆస్తి, బకాయి మొత్తాలు, సెక్షన్ 13(2) క్రింద పంపిన డిమాండ్ నోటీసులు మరియు దానిక్రింద క్లెయించేయాల్సిన మొత్తాలు, స్వాధీనతా తేదీ వివరాలు ఇందు దిగువ ఇవ్వబడినవి.:

రుణగ్రహీత, సహ-రుణగ్రహీత పేరు & చిరునామా, లోన్ ఖాతా నం., లోన్ మొత్తాలు	స్థిరాస్తి వివరాలు	1. స్వాధీనతా తేదీ, 2. స్వాధీనతా విధానం, 3. డిమాండ్ నోటీసు తేదీ, 4. బకాయి మొత్తాలు రూ..లలో
శ్రీ షేక్ ఫిరోజ్ బాషా తండ్రి శ్రీ షేక్ నజీర్ & శ్రీమతి షేక్ జరీనా, భర్త శ్రీ షేక్ నజీర్ & శ్రీమతి షేక్ అనీషా భర్త శ్రీ షేక్ ఫిరోజ్ బాషా & శ్రీ షేక్ ఖాజా మొహినుద్దిన్ చిస్తి తండ్రి శ్రీ షేక్ నజీర్ అలి, చిరునామా: డోర్ నం.22-9-76, ఆలంఖాన్ వీధి, లాలాపేట్, గుంటూరు-522003 & శ్రీ షేక్ రియాజ్ బాషా తండ్రి శ్రీ షేక్ నజీర్, చిరునామా: డోర్ నం.22-9-80, ఆలంఖాన్ వీధి, లాలాపేట్, గుంటూరు-522003, లోన్ అకౌంట్ నంబరు: హెచ్‌ఎం/0219/హెచ్/18/100080. రుణ మొత్తాలు: రూ.45,00,000/- (రూపాయలు నలభై ఐదు లక్షలు మాత్రమే)	గుంటూరు జిల్లా, గుంటూరు సబ్-డిస్ట్రిక్ట్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, లాలాపేట్, ఆలంఖాన్ వీధి వద్దగల 122.2/3చ.గ.ల విస్తీర్ణంతో కవరుచేయబడిన టౌన్ సర్వే నం.125, అసెస్మెంట్ నం.29929, బ్లాక్ నం.1, పాత వార్డు నం.11వద్ద డోర్ నం.22-9-76, 77 & 78, కలిగియున్న నివాస భవనము ఆర్‌సిసి రూఫ్ గ్రౌండ్ & మొదటి అంతస్తు యొక్క మొత్తం భాగం. సరిహద్దులు: తూర్పు: షేక్ మహబూబ్ జాని ఇంటి గోడ, 38అ.లు, పడమర: మున్సిపల్ కార్పొరేషన్ గల్లి, 39అ.లు, ఉత్తరం: మున్సిపల్ కార్పొరేషన్ గల్లి, 31అ.లు, దక్షిణం: గిరిధర్‌లాల్ భవేరి లాల్ ఇంటి గోడ, 26.5అ.లు, ఈ సరిహద్దుల్లో 122.2/3చ.గ.లు లేదా 102.56చ.మీ.ల విస్తీర్ణంతో ఆర్.సి.సి రూఫ్ గ్రౌండ్& మొదటి అంతస్తు నివాస భవనములో దానిపై అన్ని ప్రస్తుత నిర్మాణాలతో కవరుచేయబడినది. తాకట్టుదారు పేరు: శ్రీమతి షేక్ జరీనా.	1. 22.05.2024, 2. లాంఛనప్రాయ స్వాధీనం, 3. 05.12.2023, 4. 05.12.2023 ప్రకారం చెల్లించాల్సిన బకాయి రూ. 77,44,975/- (రూపాయలు డెబ్బై ఏడు లక్షల నలభై నాలుగు వేల తొమ్మిది వందల డెబ్బైఐదు మాత్రమే) మరియు 6.12.2023 నుండి పూర్తిగా చెల్లించు వరకు వర్తించబడు వడ్డీ.

తేది: 27.05.2024, ప్రదేశం: ఆం. ప్ర.
సం/- అధీకృత అధికారి, కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్ తరపున.
ఏవేని సందేహాల కొరకు సంప్రదించండి: శ్రీ జివి రవికాంత్ (+918688131208) & శ్రీ గోబింద పొద్దార్ (919073697729).

చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

Chola Enter a better life
కార్పొరేట్ ఆఫీసు: చోల క్రెస్ట్, సూపర్ బి, సి54& సి55, 4 థిరు వి క ఇండస్ట్రీయల్ ఎస్టేట్, గ్యూండీ, చెన్నై-600 032, టి.ఎన్.

డిమాండ్ నోటీసు

ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ("ది యాక్ట్") మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("ది రూల్స్") యొక్క నియమాల క్రింద.

క్రింది సంతకందారు **చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** (ది సెక్యూర్డ్ క్రెడిటర్) యొక్క **అధీకృత అధికారిగా,** చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు జారీచేసి, రూల్ 3తో చదువబడే, చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద, సంక్రమించిన అధికారాలను వినియోగించి మరియు చట్టం క్రింద, దిగువ రుణగ్రహీతలను ఆహ్వానిస్తూ సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా సదరు నోటీసుల్లో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది. డిమాండ్ నోటీసులు ను రుణగ్రహీతల తిరస్కరణతో నివారిస్తున్నారని క్రింది సంతకందారు భావిస్తున్నారు, కావున నోటీసును ఆస్తి గోడ పై అతికించారు మరియు రూల్స్ ప్రకారం ప్రచురించుట జరిగింది. డిమాండ్ నోటీసుల్లో గల అంశాలు ఇందు దిగువ చూపబడినవి:-

క్ర. సం.	రుణగ్రహీతల & సహ-రుణగ్రహీత పేరు& చిరునామా	రుణ మొత్తాలు	డిమాండ్ నోటీసు తేది & బకాయి మొత్తాలు	ఆస్తి/ సెక్యూర్డ్ అసెట్ వివరణ
1.	Loan A/c. No(s). : HL05GIV000030985 & HL11GIV000064908 1. శ్రీ/శ్రీమతి ముత్తయ్య మోదుగు, 2. శ్రీ/శ్రీమతి లక్ష్మివిమలకుమారి మోదుగు, **ఇరువురి నివాసం:** డోర్ నం.3-4, చనుబండ, చత్రాయి, పంచాయతి ఆఫీసు దగ్గర, చత్రాయి, ఆం.ప్ర.-521 214; **మరియు:** ఆర్ఎస్ నం.149/4, డోర్ నం.3-4, అంబేద్కర్ స్టాచు దగ్గర, చనుబండ గ్రామపంచాయతి, చత్రాయి మండలం, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-521 214.	ఎల్ఎఎన్: హెచ్ఎల్05జిఐవి000030985 కొరకు, మొత్తాలు రూ.15,25,000/- & ఎల్ఎఎన్: హెచ్ఎల్11జిఐవి000064908 కొరకు మొత్తాలు రూ.4,50,000/-	22.05.2024, **21.05.2024 నాటికి రూ. 20,27,649/- (రూపాయలు ఇరువై లక్షల ఇరువై ఏడు వేల ఆరు వందల నలభై తొమ్మిది మాత్రమే)**	కృష్ణా జిల్లా, విస్సన్నపేట సబ్-రిజిస్ట్రీ, చత్రాయి మండలం, చనుబండ గ్రామ పంచాయతి ఏరియా, చందుబండ గ్రామం వద్దగల ఆర్ఎస్ నం.149/4లో 600చ.గ.లు విస్తీర్ణపు ల్యాండ్ మరియు దానిపై ఆర్‌సిసి భవనముగల ఆస్తి. **సరిహద్దులు: తూర్పు:** పెరికెల రఘు నాయకులు ఆస్తి- 98.0 లింకులు; **దక్షిణం:** పోరంబోకు రోడ్-111.0 లింకులు; **పడమర:** మోదుగు రవి ఆస్తి- 127.0 లింకులు; **ఉత్తరం:** కాంచర్ల వెంకట రత్నం ఆస్తి-112.0 లింకులు, అన్ని ఈజిమెంట్ హక్కులతో.

రుణగ్రహీతలను డిమాండ్ నోటీసులు ద్వారా కోరునది ఏమనగా, ఈ ప్రచురణ తేదీ నుండి **60 రోజుల్లోగా** ఇందు పై పేర్కొన్న డిమాండ్ చేసిన మొత్తాలను వర్తించబడు వడ్డీ, అదనపు వడ్డీ, బౌన్స్ చార్జీలు, ఖర్చులు మరియు చెల్లించు రియలైజేషన్ తేదీ వరకు దానిపై వ్యయాలతో తిరిగి చెల్లించవలసిందిగా కోరబడుచున్నది. రుణగ్రహీతలు గమనించాల్సింది ఏమనగా, రుణగ్రహీతలచే తాకట్టుపెట్టిన వారి సెక్యూర్డ్ అసెట్స్‌గా స్థిరాస్తి/ఆస్తులపై సెక్యూర్డ్ డెట్స్‌కు సెక్యూర్డ్ క్రెడిటర్ నుండి రుణగ్రహీతలచే రుణ సదుపాయం పొందియున్నారని దయచేసి గమనించగలరు. సెక్యూర్డ్ క్రెడిటర్ సెక్యూర్డ్ అసెట్స్‌ను స్వాధీనంచేసుకొనుటకు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అన్ని హక్కులను కలిగియున్నారు దానితోపాటు చట్టం క్రింద అందుబాటులోగల ఇతర అంశాల దృష్ట్యా అమ్మకం రూపేనా రుణగ్రహీతలు బదిలీచేయలేరు. సెక్యూర్డ్ క్రెడిటర్ అమ్మకం మరియు ట్రాన్స్‌ఫర్ హక్కులతో దానిని స్వాధీనంకు ముందు **అటాచ్ మరియు/లేదా సీలు**కు కూడా అధికారాలు కలిగియున్నారు. సెక్యూర్డ్ క్రెడిటర్‌కు చెల్లించాల్సిన బకాయిలు కవరుచేయుటకు అమ్మకం ద్వారా తగినన్ని మొత్తాలు రాని పిమ్మట
మిగతా బకాయిలను రాబట్టుటకు సెక్యూర్డ్ క్రెడిటర్ విడిగా లీగల్ ప్రొసీడింగ్ అమలుచేయ ఆస్కారం ఉంటుంది, మరియు ఏదేని ఇతర చట్టం క్రింద సెక్యూర్డ్ క్రెడిటర్‌కు అందుబాటులోగల అన్ని ఇతర రెమెడీస్ యొక్క అదనపు మరియు స్వతంత్రంగా రెమెడీ కలిగియుంటారు.
సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13(8)కు రుణగ్రహీతలు శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది మరియు తదుపరి చట్టం యొక్క సెక్షన్ 13(13)తో రుణగ్రహీతలు సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేనిదే, ఆస్తులను అమ్మకం, లీజు, లేదా బదిలీచేయుట నుండి నిషేదింపబడినారు. మరియు ఎవరైనా సదరు నియమాలను ఉల్లంఘించినచో, సదరు చట్టం యొక్క సెక్షన్ 29 క్రింద శిక్ష పడుటకు బాధ్యులగుదురు. డిమాండ్ నోటీసు కాపీ క్రింది సంతకందారు వద్ద అందుబాటులో ఉంటుంది మరియు అవసరమైతే, రుణగ్రహీతలు దానిని ఏదేని పనిదినమున పనివేళల్లో క్రింది సంతకందారు నుండి సేకరించవచ్చును.

ప్రదేశం: గుడివాడ, కృష్ణా (ఆం. ప్ర)
తేది: 22.05.2024
సం/- అధీకృత అధికారి,
చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరపున.

భూముల ఆక్రమణలపై విచారణకు సిద్ధమా?

- సిఎస్‌కు జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ సవాల్

ప్రజాశక్తి - సీతమ్మధార (విశాఖపట్నం)

ఉత్తరాంధ్రలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్‌రెడ్డి కుమారుడు బినామీలతో 800 ఎకరాల భూములను కాజేశారని, దీనిపై సిబిఐతోగానీ, సిట్టింగ్ జడ్జితోగానీ విచారణకు సిఎస్ సిద్ధమా ? అని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ సవాలు విసిరారు. విశాఖ పౌర గ్రంథాలయంలో ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పేద రైతుల అసైన్డ్ భూములను అన్యాయంగా లాక్కున్నారని ఆరోపించారు. తాను చేసిన ఆరోపణలు అవాస్తవమైతే ఏ శిక్షకైనా సిద్ధమని ప్రకటించారు. సింహాద్రి అప్పన్న చందనోత్సవానికి ముందు జవహర్‌రెడ్డి స్వామి దర్శనం చేసుకున్నారని, ఆ తరువాత ఎక్కడికి వెళ్లారో తనకు తెలుసని అన్నారు. కుమారుడిని ముందే పంపి అన్ని అగ్రిమెంట్లు సిఎస్ చేసుకున్నారని, భోగాపురం సమీపంలోని కంచర్లలో అనుమతులు మంజూరు చేస్తూ విజయనగరం ప్రస్తుత కలెక్టర్ నాగలక్ష్మి ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చారని తెలిపారు. విజయనగరం జిల్లా పూసపాటరేగ మండలం ఇరుకొండ, చినబత్తిలి, తదితర గామాలతోపాటు విశాఖ జిల్లాలోని భీమిలి, పద్మనాభం మండలాల్లో అయినాడ, పాండ్రంగి, తిమ్మాపురం ప్రాంతాల్లో ఫ్రీ హోల్ట్ సర్టిఫికెట్లు కూడా ఇచ్చేశారని చెప్పారు. వైసిపి నాయకులు విజయనగరం, విశాఖ జిల్లాల్లో ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్లు తీసుకుని దోచేశారని ఆరోపించారు. జిఒ నెంబర్ 596 వచ్చిన రోజు నుంచి ఇప్పటి వరకు జరిగిన లావాదేవీలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సిఎం జగన్ సతీమణి భారతి పేరు చెప్పి కొన్ని లావాదేవీలు జరిగేలా చేశారన్నారు. భూ వ్యవహారాల్లో వెనుక ఉండి కథ నడిపిన తహశీల్దార్ల పేర్లు త్వరలో బయటపెడతానని చెప్పారు.

జనసేన కార్పొరేటరుకు లీగల్ నోటీసులిస్తాం : సిఎస్ కార్యాలయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డిపై అసత్య, నిరాధరమైన ఆరోపణలు చేస్తున్న విశాఖపట్నం జనసేన కార్పొరేటరు మూర్తి యాదవ్‌కు త్వరలో లీగల్ నోటీసు పంపనున్నట్లు ఎపి సిఎస్ కార్యాలయం ఆదివారం ప్రకటించింది. రెండు రోజులుగా సిఎస్‌పై మూర్తి యాదవ్ ఆరోపణలు చేస్తున్నారని, చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు న్యాయ నిపుణులను సంప్రదించామని ఆ కార్యాలయం వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే ఆయనకు లీగల్ నోటీసులు జారీచేయబోతున్నా మన్నారు.

చింతామోహన్ విమర్శలు అర్థరహితం

- షర్మిలపై వ్యాఖ్యలను ఖండించిన ఎంఎస్ బాబు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలపై మాజీ ఎంపి చింతామోహన్ చేసిన విమర్శలు అర్థరహితమని పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ బాబు అన్నారు. చిత్తూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో భూస్థాపితమైన కాంగ్రెస్‌కు పూర్వవైభవం రావడానికి కారణం షర్మిల అని పేర్కొన్నారు. సీనియర్ నాయకుడని చెప్పుకునే చింతామోహన్ పార్టీ కోసం ఏమీ చేశారో ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. కొత్త వాళ్ళు రాకూడదనే ఉద్దేశంతో చింతా మోహన్ పనిచేయడంతో.. పదేళ్లుగా పార్టీకి మనుగడ లేకుండా పోయిందనీ ధ్వజమెత్తారు. వైఎస్ఆర్ ఆశయాలను సాధించేందుకు షర్మిల ప్రయత్నిస్తుంటే.. ఆమెను వెనక్కు లాగేందుకు చింతా కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో షర్మిల డబ్బు తీసుకుని టికెట్ ఇచ్చారని ఆరోపించిన చింతా మోహన్ కాణిపాకం ఆలయంలో ప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నారా? అని సవాల్ విసిరారు. సమావేశంలో గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్, నాయకులు రవి, వెంకటేష్, రాణి తదితరులు పాల్గొన్నారు.

సైన్యంలో పనిచేయడం తప్పనిసరి : సునాక్

లండన్ : జూలై 4న జరిగే బ్రిటన్ సార్వత్రిక ఎన్నికల్లో కన్జర్వేటివ్‌లు మరోసారి విజయం సాధిస్తే 18 ఏళ్లు నిండిన యువకులకు సైన్యంలో పనిచేయడాన్ని తప్పనిసరి చేస్తామని ప్రధానమంత్రి రిషి సునాక్ హామీ ఇచ్చారు. ఆదివారం నిర్వహించిన తన మొదటి ఎన్నికల ప్రచారంలో సునాక్ ఈ హామీ ఇచ్చారు. పూర్తిగా ఒక సంవత్సరం పాటు పని చేసే అవకాశాన్ని లేదా స్వచ్ఛంధంగా ఒక ఏడాది పాటు ఒక నెలలో ఒక వారాంతం పని చేసే అవకాశాన్ని కల్పిస్తామని సునాక్ చెప్పారు.

మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

MANAPPURAM HOME FINANCE LTD.
గతంలో మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్
సిఐఎన్: యు65923కె12010పిటిసి039179
రిజిస్టర్డు ఆఫీసు: 4/470ఎ (పాత)డబ్ల్యు/638ఎ(కొత్త) మణప్పురం హౌస్ వలపాడ్ త్రిస్సూర్, కేరళ-680567.
కార్పొరేట్ ఆఫీసు: మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, మూడవ అంతస్తు, యూనిట్ నం.301 నుండి 315, ఎ-వింగ్, 'కనకియ వాల్ స్ట్రీట్', అంధేరి-కుర్ల రోడ్, అంధేరి ఈస్ట్, ముంబయి-400093, మహారాష్ట్ర. **ఫోన్ నం.**022-66211000, **వెబ్‌సైట్: www.manappuramhomefin.com**

డిమాండ్ నోటీసు

ఏదైతే, మనప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ దీని రిజిస్టర్డు ఆఫీసు: 4/470ఎ (పాత)డబ్ల్యు/638ఎ(కొత్త) మణప్పురం హౌస్ వలపాడ్ త్రిస్సూర్, కేరళ-680567 వద్ద మరియు ఇండియాలోని వివిధ ప్రాంతాలలో దీని బ్రాంచీలు (ఎంఎహెచ్ఓఎఫ్ఐఎన్"గా పేర్కొనబడును) కలిగియుండి కంపెనీల చట్టం, 1956 క్రింద రిజిస్టరైన కంపెనీ మరియు ఒక ఆర్థిక సంస్థ యొక్క అధీకృత అధికారిగా, భారత ప్రభుత్వం, ఆర్థిక సేవల శాఖ, ఆర్థిక మంత్రిత్వశాఖ, న్యూఢిల్లీ వారిచే జారీచేయబడిన తేది: 18 డిసెంబర్, 2015 నాటి నోటిఫికేషన్ నం. ఎస్.ఓ. 3466(ఇ)తో చదువబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇందు తదుపరి చట్టంగా పేర్కొనబడుతుంది) యొక్క సెక్షన్ 2 యొక్క సబ్-సెక్షన్ (1) యొక్క క్లాజ్ (ఎం) యొక్క సబ్-క్లాజ్(4) భావంతో ఒక ఆర్థిక సంస్థ, నిర్మాణం మరియు/లేదా డ్వెల్లింగ్ యూనిట్స్ కొనుగోలు కొరకు అడ్వాన్సింగ్ రుణాల వ్యాపారంచేపట్టుట మరియు ఏదైతే రుణగ్రహీత/ సహ-రుణగ్రహీతలు కాలం నం.2లో పేర్కొనబడినట్లు దిగువ పేర్కొన్న చార్ట్‌ను ఎంఎహెచ్ఓ ఫైనాన్స్ నుండి రుణం పొందియున్నారు మరియు ఏదైతే ఎంఎహెచ్ఓ ఫైనాన్స్ అనునది సెక్యూర్డ్ క్రెడిటర్‌గా, సార్ఫసీ యాక్ట్ క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 2తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఇందు దిగువ పేర్కొన్నట్లు రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలను ఆహ్వానిస్తూ నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను నోటీసు తేదీ నుండి 60 రోజుల్లోగా దానిపై వడ్డీతోసహా తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది. కాని నోటీసులు వివిధ కారణాలతో వారిలో కొందరికి చేరలేదు. దీనికి అదనంగా దిగువ రుణభారాలతో సదరు రుణగ్రహీతల సమాచారం నిమిత్తం సదరు రుణగ్రహీతలుకు ఈ బహిరంగ ప్రకటన రూపేనా తెలియజేయబడుచున్నది.

క్ర. సం.	రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీత పేరు మరియు రుణ ఖాతా నంబరు/బ్రాంచి	ఏదైతే క్రెడిట్‌చేయాల్సినదాని కొరకు సెక్యూర్డ్ అసెట్ వివరణ	ఎన్‌పిఎ తేదీ	డిమాండ్ నోటీసు తేది & బకాయి మొత్తాలు
1	ధొపల శ్రీనివాస రావు, డొప్పల సీతా మహాలక్ష్మి/ /SVIJA0003369/ విజయవాడ.	ఆర్.ఎస్.నం. 425, డోర్ నం.13/53, అసెస్మెంట్ నం.1815, గౌడ బజార్, నున్నా గ్రామం, నున్నా గ్రామపంచాయతి, విజయవాడ రూరల్, పోస్టు ఆఫీసు అడవినెక్కలం, జిల్లా-కృష్ణ, ఆం.ప్ర., పిన్: 521212	10-05-2024	16-05-2024 & Rs. 6,87,300/-

ఇందు పై పేర్కొన్నట్లుగా రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలకు ప్రకటన ఇస్తూ, ఈ నోటీసు ప్రచురించబడిన 60 రోజుల్లోగా సదరు రుణగ్రహీత/ సహ-రుణగ్రహీతల పై ఇందు పై చూపినట్లుగా పూర్తి బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా వారికి తెలియజేయబడుచున్నది. ఏదైతే సదరు రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత ద్వారా తదుపరి వడ్డీతో పాటు పూర్తి బకాయి మొత్తాలను చెల్లించుటలో విఫలం చెందినట్లైతే, ఎంఎహెచ్ఓ ఫైనాన్స్ పై వివరించినట్లు ఆస్తులపై ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ కొరకు సెక్షన్ 13(4) క్రింద తగిన చర్యలు తీసుకొంతాయి, చట్టం మరియు దాని క్రింద రూపొందిచిన రూల్స్ క్రింద సిఫారసుచేసినట్లుగా ఇతర విధానాల ద్వారా కూడా నోటీసు వారికి అందే విధంగా చర్యలు తీసుకోబడుతుంది. మీ దృష్టికి తేవడమేమనగా, సార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(8)లో వివరించినట్లుగా అమ్మకం రూపేనా ట్రాన్స్‌ఫర్ కొరకు బహిరంగ వేలం లేదా ప్రైవేట్ ట్రీటీ కొరకు నోటీసు ప్రచురణ తేదీకి ముందే ఏ సమయమునైనా, ఎంఎహెచ్ఓ ఫైనాన్స్ ద్వారా వెచ్చించిన ఖర్చులు, చార్జీలు మరియు వ్యయాలతోపాటు పూర్తి బకాయి మొత్తాలను చెల్లించి సదరు తాకట్టు ఆస్తులను విడిపించుకోగలరని గమనించ వలసిందిగా మీ దృష్టికి తేవడమైనది.
అమ్మకం, లీజు లేదా ఏదేని ఇతర విధానాల ద్వారా సెక్యూర్డ్ ఆస్తులతో లావాదేవీలు జరుపుట లేదా బదిలీచేయుట నుండి మీరు సార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్-13(13) యొక్క నియమాల ద్వారా నిషేదింపబడినారని దయచేసి గమనించగలరు.

తేది: 27 మే, 2024
ప్రదేశం: ఆం.ప్ర.
సం/- అధీకృత అధికారి
మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్



చిరిగిన చొక్కా అయినా
తొడుక్కో..
ఒక మంచి పుస్తకం కొనుక్కో..

– కందుకూరి వీరేశలింగం



ప్రజాస్వామ్యమా, రెపరెపలాడు!

బద్దలైన బేలెట్ బాక్సుల్లోనో
బిర్యానీ పేకెట్ లోనో
నిశ్చలంగా నిదురపోనీ!
ఏదో ఒక రంగు జెండాలానో
ఏ మాయా మేనిఫెస్ట్ లానో
మార్మికంగా ఒదిగిపోనీ!
నీ నిర్వచనాలన్నీ
మణిపూర్ మంటల్లోనో
వాకపల్లి ఆర్తనాదాల్లోనో
బిల్కిస్ బానో నెత్తుటి చారికల్లోనో
నిర్లజ్జగా నిద్రపోనీ!


నిన్నెగరెయ్యడానికి
నా చూపుడు వేలిని బలిస్తూనే
ఇండెలిబుల్ ఇంకుతో
నన్ను నేను నల్లబరుచుకుంటూనే ఉన్నా!
నీ స్వర్ణోత్సవాల వెలుగులకోసం
నేను డోలీలోనే తరతరాలుగా
ఆరిపోతూనే వున్నా!

నువ్వు మాత్రం భద్రం తల్లీ!
అడవినీ అంతమొందించే
నీ అధికారం చల్లగుండనీ!
నీ వేట వర్ధిల్లనీ!
కొమ్మకొక డ్రోన్ని వేలాడదీసి
అడివంతటినీ జల్లెడ పట్టనీ!
నా పాదం కింది సంపదనంతా
ఏ బడాబాబుకో సమర్పించనీ!

నీ తళుకులలో
హక్కుల కోసం
బాధ్యతలా నేలరాలుతున్నవాణ్ణి!
నీ మెరుపుల కోసం
వాక్స్వాతంత్రపు వీధుల్లో
మౌనంగా రక్తమోడుతున్న క్షతగాత్రుణ్ణి!

ఇప్పుడు...
నా నేలొక జలియన్ వాలాబాగ్
నీ మేజిక్ నంబరొక డయ్యర్ తూటా!
స్వాతంత్రం ఒక మృతదేహాల కుప్ప!

– మల్లిపురం జగదీష్



దేవుడా, చాలింక !

నిన్ను నువ్వు
దేవుడిగా ప్రకటించుకున్నప్పుడే
నీ ఓటమిని అంగీకరించావని
అర్థమవుతోంది!

అధికారానికి దూరమవుతున్నప్పుడు
నీలాంటోళ్ళందరూ
దేవుళ్ళుగా చెప్పుకుని
కాలగర్భంలో కలిసిపోయారు
మనుషుల నుండి
నిన్ను నువ్వు దూరం చేసుకుంటూ
అధికారాన్ని గుప్పిట్లో
పెట్టుకోవాలని చూస్తున్నావంటే
నీ పిరికితనం బయట పెట్టుకున్నట్లే!

మార్పన్నది మొదలయ్యాక
ఏ ఒక్కరూ ఆపలేరు అన్నది
చారిత్రక సత్యం!
అయినా నిన్ను మేము
మనిషిగా గుర్తించినదెప్పుడూ లేదు కదా?

రాజా, నీ కళలు కలలు
ఇంక చాలు చాలు
నువ్వింక మారవు
మేమే మార్చి చూపిస్తాం...

– కెక్యూబ్ వర్మ,
94934 36277

ఉత్తరాంధ్ర సాహిత్య విమర్శ - విహంగ వీక్షణం



"విమర్శ సంపూర్ణమైన కళా కాదు, శాస్త్రమూ కాదు. కళగా ప్రారంభమై శాస్త్ర లక్షణాలను సంతరించుకుంటూ ఉన్న సాహిత్య ప్రక్రియ. ఒక ప్రాపంచిక దృక్పథాన్ని కలిగిన విమర్శకుడు నిర్వహించే సామాజిక బాధ్యత సాహిత్య విమర్శ" అన్నారు వల్లంపాటి వెంకటసుబ్బయ్య. దీన్నిబట్టి సాహిత్య విమర్శ అంటే విమర్శకుడు సామాజిక బాధ్యతతో ఒక సాహితీ ప్రక్రియలో మంచి చెడులను సాధికారకంగా విశ్లేషించడమే! కళింగాంధ్రలో అనేకమంది సాహిత్య విమర్శకులు సామాజిక బాధ్యతతో సాహిత్యాన్ని పరిమర్శించారు. ఇప్పటికీ ఆ కృషిని కొనసాగిస్తున్నారు.

ఉత్తరాంధ్ర తొలితరం విమర్శకులు మహాకవి గురజాడ అప్పారావు. కథానిక, గేయంతో పాటు విమర్శను కూడా రాశారు. పలు వ్యాసాలు ద్వారా ఉత్తమ విమర్శను వెలువరించారు. 'కావ్యము నందు శంగారం, ముత్యాల సరాల లక్షణము, కవిత్వం– వర్డ్సువర్త్, కన్యాశుల్కం, ఆకాశరామన్న ఉత్తరాలు, గ్రామ్య శబ్ద విచారణం, ప్రపుల్ల లేక రాణీ చౌదరి (బంకించంద్రుని నవలా రచన), భట్టకలంకుడు (కన్నడ వ్యాకరణములు), ఆంధ్ర కవితా పిత–1,2,3,4; మాటామంతీ–3,4,5 మొదలగు వ్యాసాలలో గురజాడ విమర్శనా ప్రతిభ ద్యోతకమవుతుంది. చిన పురుషోత్తమ పంతులు, లక్ష్మణరావు పంతులు వేర్వేరు పత్రికల్లో వ్యవహారిక భాషను నిరసిస్తూ వ్యాసాలు వ్రాశారు. వాటిని ఖండిస్తూ గురజాడ 'గ్రామ్య శబ్ద విచారణం' అనే పేరుతో ఒక వ్యాసం వ్రాశారు. కళింగాంధ్రకే చెందిన మరో పండితుడు గిడుగు వేంకట రామమూర్తి పంతులు 'ఎ మెమోరాండం ఆన్ మోడరన్ తెలుగు, ఎ మాన్యువల్ ఆఫ్ సవర లాంగ్వేజ్, సూర్యరాయాంధ్ర నిఘంటు విమర్శనం' లాంటి విమర్శ గ్రంథాలు రచించారు. సవర భాషకు సంబంధించి పలు పరిశోధనలు చేసి పుస్తకాలుగా ప్రచురించారు. కళింగాంధ్ర ముద్దుబిడ్డ, హేతువాది తాపీ ధర్మారావు ఈ ప్రాంత విమర్శనా స్థాయిని దేదీప్యమానంగా వెలిగించారు. చేమకూర వేంకటకవి రాసిన 'విజయవిలాసం' పై 'హృదయోల్లాస వ్యాఖ్య' పేరిట అపురూపమైన కావ్య నిర్మాణం చేపట్టారు. దీనికి 1971లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

వ్యవహారిక భాషావాదులైన గిడుగు, గురజాడలను సంప్రదాయ ధోరణితో మొదట్లో తాతాజీ విమర్శించారు. తరువాత కొత్తపాళీ పేరున వారినే అనుసరించారు. ఆయన విమర్శ బహుముఖీనం. కొత్త పాళీ, సాహిత్య మొర్మొరాలు, దేవాలయాలపై బూతు బొమ్మలెందుకు, పెళ్లి దాని పుట్టుపూర్వోత్తరాలు, ఇనుప కచ్చడాలు మొదలగు గ్రంథాలను ప్రగతిశీల దృష్టితో రాశారు. సెవెన్ స్టార్ సిండికేట్ వారి ప్రచురణ 'నవత'లోని కవిత్వాన్ని రాచమల్లు రామచంద్రారెడ్డి విశాలాంధ్ర పత్రికలో నిశితంగా విమర్శించారు. దానిపై తాతాజీ స్పందిస్తూ – విమర్శకుని కర్తవ్యం అభ్యుదయ రచనను పెంపొందించడం తప్ప, ఖండించడం కాదని అభిప్రాయపడ్డారు. ఇక్కడే పుట్టిన చిలుకూరి నారాయణరావు ముఖ్యంగా భాషా విమర్శకుడు. 'ఆంధ్ర భాషా చరిత్రం– రెండు సంపుటాలు, ఆంధ్రదేశపు జానపద గేయాలు, బాలల గేయ సాహిత్యం, 11వ శతాబ్దం నాటి తెలుగు భాష, చక్కెటులు–సామెతలు' మొదలగు గ్రంథాలు ఇతని విమర్శనా పటిమకు నిదర్శనాలు.

బహుభాషా కోవిదుడు రోణంకి అప్పలస్వామి అనేకమంది కవుల, రచయితల పుస్తకాలకు మున్నుడులు వ్రాశారు. నారాయణ బాబు రుధిరజ్యోతికి రాసిన పీఠిక ప్రశస్తమైనది. శ్రీశ్రీ మహాకవి ఎందుకయ్యాడో అనే విషయాలను సమున్నతంగా వివరిస్తూ విమర్శ చేశారు. రోణంకి మరో విమర్శ 'కవిత్వ నిజస్వభావం' పుస్తక రూపంలో ఉంది. శ్రీశ్రీ రాసిన 'గురజాడ' అనే వ్యాస సంపుటిలో గురజాడ ప్రారంభించిన ముత్యాలసరాలు ఛందస్సు గురించి, దాని పుట్టు పూర్వోత్తరాల గురించి, ఆయన వచన రచన నైపుణ్యం గురించి, ప్రగతిశీలమైన సామాజిక దృక్పథాన్ని గురించి, వ్యవహారిక భాషావాదాన్ని గురించి ప్రస్తుతించారు. కన్యాశుల్కం బీభత్స రస ప్రధానమైన విషాదాంత నాటకమన్నారు. గురజాడ దేశభక్తి గేయం ప్రపంచ సాహిత్యంలో గొప్పస్థానం పొందదగినదని శ్రీశ్రీ అభిలషించారు. ఆరుద్ర 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' పేరిట 14 సంపుటాలు వెలువరించారు. ఇతర గ్రంథాలను ఎన్నింటిని రచించినా ఈ రచనతోనే ఉత్తమ విమర్శకుడిగా ఆరుద్ర పేరెన్నికగన్నారు. వేమనవేదం, మన వేమన, వ్యాసపీఠం, గురజాడ గురుపీఠం, ప్రజాకళలు– ప్రగతివాదులు అనేవి ఆయన మరికొన్ని సాహిత్య విమర్శనా గ్రంథాలు. చా.సో కథలకు సంబంధించిన సాహిత్య విమర్శ ఆయన కుమార్తె చాగంటి తులసి చేశారు. 'సాహితీ తులసి' అనే వ్యాస సంపుటి కూడా ముద్రించారు. రావిశాస్త్రి రాసిన పలు సాహిత్య వ్యాసాలు, సంపాదకీయాలు, మున్నుడులు, ఎలీజీలు, నాటకాలను 'రావిశాస్త్రీయం' పేరిట వచ్చిన పుస్తకములో పొందుపరిచారు.

హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు విరచితం 'షేక్స్పియర్–కాళిదాసు' అనే శీర్షికతో గొప్ప వ్యాసమొకటి వచ్చింది. యు.ఎ.నరసింహమూర్తి గారి గ్రంథం 'కన్యాశుల్కము–19 శతాబ్ది ఆధునిక భారతీయ నాటకాలు'. ఇది 'కన్యాశుల్కం'పై వచ్చిన ప్రామాణిక విమర్శ గ్రంథంగా భాసిల్లుతోంది. వీరిదే 'నారాయణ బాబు అసంకలిత రచనలు' అనే వ్యాసం కౌముది పత్రికలో ప్రచురితమైంది. ఎస్.వి.జోగారావు నుంచి 'ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర, మణిప్రవాళం అనే విమర్శనా సాహిత్యం వెలువడింది. మణిప్రవాళం గ్రంథానికి 1989లో సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది.

ప్రసిద్ధ సాహిత్య విమర్శకులు వెల్చేరు నారాయణరావు ప్రస్తుత విజయనగరం జిల్లా అంబఖండి గ్రామంలో జన్మించారు. 'తెలుగులో కవితా విప్లవాల స్వరూపం' అనే విమర్శనా గ్రంథాన్ని పరిశోధన నిమిత్తం వ్రాశారు. కళాపూర్ణోదయం, కన్యాశుల్కం పుస్తకాలపై సాధికారిక విమర్శ చేసి, చర్చ పెట్టారు. పురిపండ అప్పలస్వామి ఆంధ్ర సాహిత్య చరిత్రను ఒరియా భాషలోకి అనువదించారు. వంగ సాహిత్య చరిత్ర, ఒడియా సాహిత్య చరిత్ర అనే పుస్తకాలు వ్రాశారు. ప్రముఖ కథకులు కా.రా మాస్టారు విమర్శకునిగా తన వంతు సాహితీ సేవ చేశారు. కథాకథనం, కథాయజ్ఞం అనే విమర్శక గ్రంథాలను వెలువరించారు. ఔత్సాహిక కథకులు చదవాల్సిన గ్రంథాలివి. కె.ఎన్.వై పతంజలి రాసిన 'నా దేవుడు గురజాడ' లాంటి వ్యాసాలు పేరెన్నిక గన్నవి. పొందూరుకు చెందిన అల్లంశెట్టి అప్పయ్య తొలి తరం కవి, విమర్శకులు. రామాయణ సారస్వత దర్శనం, రసికజన మనోభిరామ కావ్య విమర్శనం (రాతప్రతి) అనే విమర్శనా గ్రంథాలను వ్రాశారు. వీరి కుమారుడే అల్లంశెట్టి చంద్రశేఖరరావు. ఈయన సవర భాషకు సంబంధించిన పరిశోధన చేశారు. గిరిజన సాహిత్యంపై, గిడుగుపై సందర్భానుసారం పలు వ్యాసాలు వ్రాశారు. 'గురజాడ కవిత్వంలో ధ్వని' అనే వ్యాసం ఆయన విమర్శనా స్థాయికి గీటురాయి. ఇదే ఊరుకు చెందిన ఘండికోట బ్రహ్మాజీరావు 'ప్రాచీన భారతీయ సాహిత్యంలో కథ' అనే విమర్శనాత్మక గ్రంథం వ్రాశారు. 'శ్రీమత్ సుందరకాండ– సౌందర్య దర్శనమ్' 6 భాగాలు వీరి ఆధ్యాత్మిక రచన. ఈ ప్రాంతానికే చెందిన మరో కవి కొంక్యాన ఛాయరాజ్ గురజాడ, శ్రీశ్రీలపై విశ్లేషణాత్మక విమర్శనా వ్యాసాలు వ్రాశారు. ఈ ప్రాంతానికి చెందిన రామతీర్థ మంచి విమర్శకుడు. రావిశాస్త్రిపై 'రావిసారాలు' అనే సాహిత్య వ్యాసాలు వీరికి పేరు తెచ్చాయి. అనకాపల్లిలో పుట్టిన నిర్మలానంద పలు అనువాదాలు చేశారు. 'మన్యం వీరుని పోరుదారి' అనే వ్యాస సంకలనాన్ని ప్రచురించారు. 'లూషన్ వ్యక్తిత్వము–సాహిత్యం' అనే పుస్తకానికి సంపాదకత్వం వహించారు. రాజాంలో జన్మించిన దామెర వెంకట సూర్యారావు ఎన్నో వ్యాస సంపుటాలను ప్రచురించారు. వీరి రచనల్లో 'మహాభారత నామకోశం' ఒకటి. ఇందులో 4,125 పైగా పాత్రలు, ప్రదేశాలు, ఇతర అంశాల సంక్షిప్త పరిచయాలు ఉంటాయి. కణుగుల వేంకటరావు తన సాహిత్య వ్యాసాలను 'కవేరా–కలం,కాలం' గ్రంథంలో నిక్షిప్తం చేశారు.

రాజాం నుంచి గార రంగనాథం 2022లో ఆముక్త మాల్యదపై రాసిన 30 వ్యాసాల 'రాయరత్న మంజూష' మంచి విమర్శక గ్రంథం. వీరి సంపాదకత్వంలో 'సాహితీ సౌరభాలు, విస్మృత కళింగాంధ్ర సాహితీ ప్రభ' అనే వ్యాస సంకలనాలు వెలువడ్డాయి. ఈ రాజాం సమీప గ్రామంలో పుట్టిన అయ్యగారి సీతారత్నం 'సాధిత' అనే వ్యాసాల సంపుటిని రచించారు. ఈ వ్యాస రచయిత 2022లో 'ఆజిరి' పేరన 30 సాహిత్య వ్యాసాల సంపుటిని ముద్రించారు. జి.ఎస్.చలం ... 'భూషణం' మాస్టారు జీవితం– సాహిత్యంపై విశ్లేషణాత్మక విమర్శ వ్రాశారు. 'భూషణం' పేరిట 2021లో సాహిత్య అకాడమీ ఈ పుస్తకాన్ని ప్రచురించడం విశేషం. ఇంకా 'కళింగాంధ్ర మాండలిక పదకోశం' అనే విలువైన పుస్తకాన్ని అందించారు. భమిడిపాటి గౌరీశంకర్ 'విస్తృతి' అనే వ్యాస సంపుటిని ప్రచురించారు. వెలుగుసంస్థ ప్రతినిధి శాసపు రామినాయుడు 'మూడు యాభైల గురజాడ' పేరిట ఒక పుస్తకం తీసుకొచ్చారు. శ్రీకాకుళానికి చెందిన వెలమల సిమ్మన్న ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్గా 'తెలుగు సాహిత్య విమర్శ–సిద్ధాంతాలు' అనే గ్రంథాన్ని ప్రచురించారు. సిక్కోలుకు చెందిన మరో రచయిత ప్రొఫెసర్ కె.ఎస్.చలం సామాజిక విమర్శకు పెద్దపీట వేశారు. 'త్రికళింగ దేశ చరిత్ర' అనే గ్రంథం వెలువరించారు. ఇదే సామాజిక విమర్శను ఆదిభట్ల విద్యాసాగర్, కె.అజశర్మ కొనసాగించారు. ప్రాంతీయ దృక్పథంతో కథాప్రక్రియకు సంబంధించి 'ఉత్తరాంధ్ర కథా వెలుగు' పేరిట విమర్శనాత్మక పుస్తకాన్ని, 2006లో వి.ఎస్.ఎన్ మూర్తి సంపాదకత్వంలో 'వెలుగు' సాహితీ సాంస్కృతిక సంస్థ ప్రచురించింది. ఇంకా ఈ ప్రాంతానికి చెందిన చిత్ర, దీర్ఘాశి విజయభాస్కర్, దుప్పల రవికుమార్, బెందాళం కృష్ణారావు, నల్లి ధర్మారావు, వాండ్రంగి కొండలరావు, బద్రి కూర్మారావు, రాజా మానాపురం చంద్రశేఖర్, బాల సుధాకర మౌళి, ఆల్తి మోహనరావు, సారిపల్లి నాగరాజు, అలజంగి మురళీధరరావు తదితరులు విమర్శక వ్యాసాలను వ్రాస్తున్నారు. బరంపురానికి చెందిన తుర్లపాటి రాజేశ్వరి కూడా విమర్శ విరివిగా రాస్తున్నారు. కళింగాంధ్రను మెట్టినిల్లుగా చేసుకున్న కె.ఎన్.మల్లీశ్వరి కథపై విమర్శ చేసారు.

గురజాడ, గిడుగు నుండి నేటి అట్టాడ, గంటేడ వరకు సాహిత్య విమర్శను అడపాదడపా రాసినవారే. కానీ వారంతా దాన్ని ప్రధాన కార్యక్షేత్రంగా తీసుకోలేదు. ఈ నేలమీద సాహిత్య విమర్శను రాసిన రచయితలు ఉన్నా, హెచ్చుమంది వారు రాసిన విమర్శకు పుస్తక రూపం ఇవ్వకపోవడం మరో లోపం. ఇతర సాహిత్య ప్రక్రియలలాగా మొత్తం తెలుగునేలలో విరివిగా విమర్శ, విమర్శకులు పుట్టుకు రాకపోవడానికి అనేక కారణాలున్నాయి. అవే కారణాలు కళింగాంధ్రకూ వర్తిస్తాయి. 'మంచి సమాజం ఏర్పడాలంటే మంచి సాహిత్యం రావాలి. మంచి సాహిత్యం రావాలంటే మంచి విమర్శకులు రావాలి' అన్న 'కొడవగంటి కుటుంబరావు' మాటల్ని మననం చేసుకుంటూ తెలుగు సాహిత్యానికి సంబంధించి కళింగాంధ్రలో మరింతగా విమర్శకులు తయారుకావల్సిన అవసరం ఎంతైనా వుంది.

– పిల్లా తిరుపతిరావు
70951 84846

మేడే రచనల పోటీ - 2024 ఫలితాలు

మేడే సందర్భంగా విజయవాడలోని జాషువా సాంస్కృతిక వేదిక నిర్వహించిన రచనల పోటీ ఫలితాలను ప్రకటించారు. కథలు, కవితలు, పాటల విభాగాల్లో ప్రకటించిన విధంగా బహుమతులు అందజేస్తున్నామని నిర్వాహకులు గుండు నారాయణరావు తెలిపారు. చాలా తక్కువ రచనలు వచ్చినందున వ్యాసాల విభాగంలో పోటీని రద్దు చేస్తున్నామని తెలిపారు. బహుమతి ప్రదానోత్సవ సభ జూన్ నెలలో విజయవాడలో జరుగుతుందని, విజేతలు స్వయంగా హాజరై, బహుమతులు స్వీకరించాలని కోరారు. 'బహుమతి పొందిన రచనలతో పాటు మరికొన్ని రచనలను ఎంపిక చేసి, కథా, కవితా సంకలనాలు వెలువరిస్తాము. ఆ పుస్తకాల ఆవిష్కరణ బహుమతుల ప్రదాన సభలో ఉంటుంది.' అని వివరించారు. విజేతల వివరాలు ఇవీ ...

కవితలు :			
1. మొదటి బహుమతి	రూ. 5000	క్షేత్రం	డా॥ దారల విజయకుమారి, తిరుపతి
2. రెండవ బహుమతి	రూ. 3000	మేడే జెండా'	కంచరాన భుజంగరావు, శ్రీకాకుళం
3. మూడవ బహుమతి	రూ. 2000	శ్రమ గొలుసు	సోమిశెట్టి వేణుగోపాల్, కరీంనగర్
4. కన్సొలేషన్ బహుమతి	రూ. 1000	కన్నీటి చుక్కల సిరాతో...	పొత్తూరి సీతారామరాజు, కాకినాడ
5. కన్సొలేషన్ బహుమతి	రూ. 1000	సర్కార్ కంప	చిత్తలూరి సత్యనారాయణ, విజయవాడ
కథలు :			
1. మొదటి బహుమతి	రూ. 5000	మాసిపోని మరకలు	సయ్యద్ గఫార్, హైదరాబాద్
2. రెండవ బహుమతి	రూ. 3000	హిందూసితాహమారా	కె.ఆనందాచారి, ఖమ్మం
3. మూడవ బహుమతి	రూ. 2000	ధింసా చేమంతి	ఎల్.శాంతి, తాడేపల్లి
4. కన్సొలేషన్ బహుమతి	రూ. 1000	జీవితపు ఖరీదు	వాడపల్లి పూర్ణ కామేశ్వరి, చెన్నై
5. కన్సొలేషన్ బహుమతి	రూ. 1000	తల మనిషి	బట్టిపాటి జైదాస్, నెల్లూరు
పాటలు :			
1. మొదటి బహుమతి	రూ. 5000	మేడే దీపం	పావెల్
2. రెండవ బహుమతి	రూ. 3000	నిరుపమైన జెండా	సంపటం దుర్గా ప్రసాద్, విజయవాడ.
3. మూడవ బహుమతి	రూ. 2000	లేవరా రైతన్న	డాక్టర్ రావెళ్ళ శ్రీనివాసరావు, విజయవాడ.
4. కన్సొలేషన్ బహుమతి	రూ. 1000	నేడే మేడే	కుడికాల వంశీధర్, హైదరాబాద్.
5. కన్సొలేషన్ బహుమతి	రూ. 1000	మేడే	బి.గోవర్ధనరావు, విశాఖపట్నం

ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కథలకు వేంపల్లి షరీఫ్, కె. ఉషారాణి, వొరప్రసాద్; కవితలకు అరసవిల్లి కృష్ణ, అనిల్ డానీ, శాంతిశ్రీ; పాటలకు జగన్, నారాయణ వ్యవహరించారు. ఈ పోటీల్లో పాల్గొన్న కవులకు, రచయితలకు, వ్యాసకర్తలకు, తమ సమయాన్ని వెచ్చించి రచనల ఎంపిక జరిపిన న్యాయనిర్ణేతలకు జాషువా సాంస్కృతిక వేదిక ధన్యవాదాలు తెలియజేసింది.

దీర్ఘ వేదనకి వాక్యానువాదం ఇది!

చిన్ని చిన్ని పద్యాల గురించి ఆలోచించే కాలంలో రత్నాజీ నుంచి ఈ దీర్ఘ కవిత అందింది. అయిదారు పంక్తుల "వొక్కపొద్దు పద్యాల" మధ్య ఇంత పెద్ద కవిత చదవడానికి నాకు కాస్తంత శిక్షణ కావలసి వచ్చిందంటే ఆశ్చర్యమేమీ లేదు. కవిత్వం వొక మూడ్ అనుకుంటే, అలాంటి సందర్భాల్లో రీడర్ కూడా అదే మూడ్లో ప్రవహిస్తూ పోతున్నప్పుడు– దానికి భిన్నమైన వాక్య సందోహం తారసపడితే కొంచెం అసౌకర్యంగా వుంటుంది. అలాంటి అసౌకర్యమైన స్థితిలో చదివాను రత్నాజీ దీర్ఘ కవిత.

ఇది యింకో రకంగా జాగాకి సంబంధించిన సమస్య కూడా! కాగితమ్మీదే కాదు, మనసులో ఆలోచనల్లో వొక విషయానికి మనం ఎంత జాగా ఇస్తామన్న సమస్య. కవిత్వంలో ఆ విషయాలకు ఇచ్చే జాగా మన తాత్విక గాఢతని బట్టి వుంటుంది, అంతకంటే ఎక్కువగా మన రాజకీయ దృష్టిని బట్టి వుంటుంది. గాజా గురించి రత్నాజీ ఇంత దీర్ఘ కవిత రాయడానికి పెద్ద కారణం ఆ రాజకీయ దృష్టి!

గాజా గురించి ఎంతమంది తెలుగు మేధావులు ఎన్ని రాసినా, సాహిత్య జీవుల నుంచి సరయిన స్పందన లేదని నా ఫిర్యాదు. ప్రపంచమంతా పనులన్నీ పక్కన పెట్టి, ఈ అన్యాయాన్ని గురించి గొంతెత్తుతున్న సమయంలో కూడా తెలుగు కవులూ రచయితలకు ఇది పెద్దగా పట్టలేదు. తనదైన వొక కుటీరంలో తెలుగు కవి ముణుక్కొని కూర్చొని వున్నాడు. ఈ దుర్మార్గమైన స్థితిని ధిక్కరించి, రత్నాజీ ఏకంగా దీర్ఘ కవితే నిరసన కేకలాగా ఎక్కుపెట్టి వదిలాడు.

"ఎందుకో ఈ పూట అన్నం
సయించటం లేదు"

అలాంటి అసహనం చెరబండరాజు కూడా అనుభవించాడు, ఆగస్టు పదిహేను నాడు. ఫైజ్ అహమద్ ఫైజ్ కూడా అదే పలవరింతలోంచి రాశాడు. ఇప్పుడు రత్నాజీ అదే వాక్యంలో తన రాజకీయ ప్రతిబింబాన్ని వెతుక్కుంటున్నాడు. అయితే, రత్నాజీ ఇందులో కాలాన్ని పట్టుకున్న పద్ధతి ఎలా వుందో చూడండి:

"సెల్ఫీ తీసుకుందామని
తోటల మధ్య నిలబడ్డాను
నా కాళ్ళ ముందో
పాలస్తీనా పిల్ల తల తెగిపడింది"

చేతిరాతతో పలకరించే కాలాన్ని దాటుకొచ్చి, ఇవాళ సాంకేతికతే భాషగా మారిన కాలంలో కూడా అదే నొప్పి. చెరబండరాజునో, ఫైజ్నో నడిపించిన కాలానికీ, ఇప్పుడు రత్నాజీని నడిపిస్తున్న కాలానికీ మధ్య చాలా తేడా వుంది. సానుభూతి, సహానుభూతి అనేవి ఏమాత్రం మిగలని దయారహిత కాలం ఇది.

ఈ దీర్ఘ కవిత 17 భాగాల 22 పేజీల గుండెకోత. నిజం చెప్పాల్సి వస్తే, ఈ కవిత గురించి మా ఇద్దరి సంభాషణ



పోయిన అక్టోబరులో మొదలైంది. "గెర్నికా ఓ పాలస్తీనా!" అనే శీర్షికతో రత్నాజీ ఈ దీర్ఘ కవితని ఫేస్‌బుక్ ద్వారా మనకి అందించాడు. ఈ సుదీర్ఘ కాలంలో రత్నాజీ ఈ కవితలో చాలా మార్పులు చేర్పులూ చేసుకున్నాడు. ప్రతి మార్పూ ఇప్పటి దీర్ఘ కవిత దాకా చేరిన పద్ధతి చూస్తే, వొక కవి తన కవితని పదునెక్కించడానికి యెలాంటి నిర్మాణ సాధనాలు సమకూర్చుకుంటాడో– అది విమర్శకులు చెప్పాల్సిన విషయం. కానీ, సాటి కవిగా అంతకంటే యెక్కువగా ఈ కవితని వొకటికి పదిసార్లు దగ్గరగా చదువుకున్న రీడర్గా నేను చెప్పాలనుకున్న ముఖ్యమైన విషయాలు రెండు : 1. కవిత్వానికి రాజకీయాల రక్తస్పర్శ లేకపోతే అది నిర్జీవమే! 2. రాజకీయ బలం ఎంత వున్నా అందులో కవిత్వ తీవ్రత లేకపోయినా అది నిర్జీవమే!

ఆ రెండిటీని వొకటి చేసే ప్రయత్నమే రత్నాజీ దీర్ఘ కవితకి బలం! ఇందులోని ప్రతి వాక్యం అద్భుతమైన చుట్టరికాన్ని యేర్పర్చుకుంటూ, మనతో రక్త బంధాన్ని కోరుకుంటుంది. కవిత్వానికి వాక్యాల సముదాయమే బలగం కాదు, ఆ వాక్యాలు యెటు మళ్లుతాయన్న చైతన్యమే పెద్ద బలగం. మరీ ముఖ్యంగా– దీర్ఘ కవిత అనేది అలాంటి వొక చైతన్యవంతమైన బలగాన్ని యేర్పర్చుకునే రాజకీయ ప్రకటన.

– అఫ్సర్


బాల సాహిత్యానికో నవ నవల

బాల సాహిత్యాన్ని సృజించాలంటే ఉపాధ్యాయులకు ఉన్నంత అవకాశం మరెవరికీ ఉండదేమో!వివిధ వయసుల పిల్లలతో, వివిధ ప్రాంతాల, వివిధ సామాజిక, ఆర్థిక నేపథ్యం గల పిల్లలతో వారు గడుపుతూ ఉంటారు. అంతో ఇంతో పిల్లల తల్లిదండ్రులతో కూడా కొద్దిపాటి పరిచయాలు ఏర్పడతాయి. పిల్లల్లో విద్య సామర్థ్యాలలో వ్యత్యాసాలు, ప్రవర్తనల్లో ఉన్న తేడాలకు గల కారణాలను దగ్గరనుంచి పరిశీలించే అవకాశం ఉపాధ్యాయులకు ఎక్కువ ఉంటుంది. పిల్లలు కూడా తల్లిదండ్రులతో కూడా పంచుకోలేని కొన్ని విషయాలు ఉపాధ్యాయులతో ఇష్టంగానూ, నమ్మకంగానూ పంచుకుంటుంటారు. ఉపాధ్యాయులు ఎక్కువసేపు పిల్లలతో గడపగలగడమే కాకుండా వారి విద్యా వికాసానికి, మానసిక వికాసానికి కార్యబద్ధులై ఉంటారు కాబట్టి, విద్యార్థి ఉపాధ్యాయుల బంధాలు అపురూపంగా ఉంటాయి. సృజనకారులైన ఉపాధ్యాయులు కొందరు, వారి అనుభవాలను అక్షరబద్ధం చేయడం వల్ల మంచి రచనలు వస్తున్నాయి. ఇటీవలి కాలంలో కళాశాల విద్యార్థుల గురించి చెన్నూరి సుదర్శన్ రాసిన జర్నీ ఆఫ్ ఏ టీచర్, బడి పిల్లల్లా గురించి శీలా సుభద్ర రాసిన ఇస్కూల్ కతలు, సమ్మెట ఉమాదేవి రాసిన మా పిల్లల ముచ్చట్లు ఒక టీచర్ అనుభవాలు ఈ కోవకు చెందినవే. అయితే డా. సమ్మెట విజయ ఒక అడుగు ముందుకు వేసి, తన ఉపాధ్యాయ జీవితపు నేపథ్యంతో 'బడే నా లోకం' అనే నవలను వెలువరించారు.

రచయిత్రి అంతక్రితం పదేళ్ళు ఒక ప్రైవేటు పాఠశాలలో పనిచేసిన అనుభవాలు, అనుభూతులు ఉన్నప్పటికీ, తరువాతి కాలంలో పనిచేసిన సికిందరాబాద్ మిక్స్‌డ్ రైల్వే స్కూల్లో భిన్నమైన అనుభవాలను పొందారు. ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా కాలంలో అన్ని వ్యవస్థలతో పాటు విద్యా వ్యవస్థ కూడా కుదేలైపోయింది. ఒకే సమయంలో ఈ రచయిత్రి, ఆమె భర్త కూడా కరోనా వ్యాధి బారినపడి నిర్బంధ విశ్రాంతి దొరికింది. ఆ సమయంలో చుట్టుముట్టిన జ్ఞాపకాలను దొంతరగా పేర్చి 'బడే నాలోకం' అనే నవలగా కూర్చారు. మీనా అనే టీచర్ పాత్ర ద్వారా పాఠశాలలో ఆమె ప్రవేశించిన నాటి నుంచి, తాను పొందిన అనేక అనుభవాలను నవలలో పొందుపరిచారు.

ఇందులో పరిస్థితులకు లోబడి ప్రవర్తించే సమకాలీన విద్యర్థుల, తల్లిదండ్రుల మనస్తత్వాలను ఆమె సమర్థవంతంగా చిత్రీకరించారు. దిగువ మధ్య తరగతి జీవితాలు గడుపుతున్న పిల్లల ఆరోగ్యాలు, అలవాట్లు, ట్రాఫిక్ రూల్స్, సెల్‌ఫోన్ వల్ల వచ్చే అనర్థాలు, లాభాలు వివరిస్తూనే.. అనుకోకుండా పిల్లలు దొంగతనం, పొగ తాగడం, అబద్ధాలు ఆడడం వంటి అలవాట్లను గమనించి.. వాళ్ళను అర్థం చేసుకుని సున్నితంగా వ్యవహరించే టీచర్ల గురించి రాశారు. మారుతున్న కాలంతో పాటు విద్యా విధానంలో చోటు చేసుకున్న కొత్త మార్పులైన ఆన్ లైన తరగతులు, డిజిటల్ పాఠాల గురించి ప్రస్తావించారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఇస్తున్న ప్రాధాన్యతలు వివిధ సందర్భాల్లో విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడానికి నిబద్ధతతో కషి చేస్తున్న టీచర్ల గురించి ప్రస్తావించారు.

బడిపిల్లలు పసి వయసునుంచి కౌమార దశలోకి వెళ్తున్న క్రమంలో కొన్ని శారీరక మార్పులు, ప్రవర్తనలో మార్పులు వస్తుంటాయి. కొన్ని కొత్త అలవాట్లు అవుతుంటాయి. మనం వద్దన్న పనిని చాటుగానైనా చేస్తుంటారు. ఒకరి మీద ఒకరు నేరారోపణ చేసుకుంటుంటారు. అన్నింటిలో తమకు గుర్తింపును కోరుకుంటారు. చదువులో ఎలా ఉన్నా సందర్భం వచ్చినప్పుడు వివిధ విషయాల్లో వాళ్ళ ప్రతిభను కనపరుస్తుంటారు. పిల్లలతో ఎక్కువ కాలం గడిపే ఉపాధ్యాయులు వాటిని వెలికి తీస్తుంటారు.



ఇటువంటి అనేక అంశాల కూర్పే 'బడే నా లోకం' నవల. బాల సాహిత్యంలో కథా సాహిత్యం, గేయ సాహిత్యం విరివిగా ఉన్నది. కానీ నవలా, నాటికా సాహిత్యం చాలా తక్కువ. రచయితలు పూనుకుంటే ఎన్నో సామాజికాంశాలను కూర్చి చక్కటి నవలలను చక్కగా వెలువరించవచ్చని ఈ నవల మనకు తెలియజేస్తుంది.

గతంలో పిల్లలను అద్భుత లోకంలోకి విహరింపజేసే నవలలు అనేకం వచ్చాయి. బాల, చందమామ, బొమ్మరిల్లు బాలమిత్ర వంటి పత్రికల్లో వచ్చిన జానపద నవలలు, పౌరాణిక సీరియల్స్ పిల్లలను అమితంగా అలరించేవి. చింతా దీక్షితులు రాసిన శంపాలత, లీలా సుందరి, శీతంరాజు రాసిన ఒకరోజు రాజు, వీర మల్లుడు సాహసాలు, రౌతుకొద్దీ గుర్రం, సింగంపల్లి అప్పారావు రాసిన సముద్రపు దొంగలు, ఆలూరి భుజంగరావు రాసిన అంతా గమ్మత్తు, శ్రీవాత్సవ రాసిన జల్తారు జాబిల్లి, కెఆర్ కె మోహన్ వెలువరించిన ఏడు పిల్లల నవలలు, విద్వాన్ దేవరకొండ చిన్న కృష్ణశర్మ రాసిన ఆనంద, దాసరి నాగభూషణం చందమామ కోసం రాసిన అనేక జానపద నవలలు; గద్దె లింగయ్య, రావూరి భరద్వాజ సంయుక్తంగా రాసిన పరకాయ ప్రవేశం, బోసుబాబు రాసిన రాజభక్తి, కిరణ్ కుమార్ రాసిన చందమామ రావే ... ఇలా పిల్లల కోసం వెలువడిన మంచి నవలా సాహిత్యం మనకు ఉన్నప్పటికీ... ప్రస్తుతం వీటి లభ్యత ప్రశ్నార్థకమే! ఇటీవల మంచి పుస్తకం, తానా వారు సంయుక్తంగా పోటీలు నిర్వహించడం మొదలుపెట్టాక, చంద్రశేఖర్ ఆజాద్, సలీం, సుజల గంటి, కన్నెగంటి అనసూయ, శాఖమూరి శ్రీనివాస్, కిరణ్ జమ్మల మడక, వీఆర్ శర్మ, టీవీ రామకృష్ణ వంటివారు రచించిన నవలలు కొన్ని వెలుగు చూశాయి. పత్రికలు, ప్రచురణకర్తలు ప్రోత్సహిస్తే మరెన్నో బాలల నవలలు తప్పకుండా వస్తాయి.

కరోనా కాలాన్ని ఒక విషాద సమయంగా కుంగిపోకుండా పాఠశాల విద్యకు సంబంధించిన చక్కని రచనను చేసి సమయాన్ని ఉపయుక్తంగా మలుచుకుని మంచి నవలను అందజేసిన రచయిత్రికి అభినందనలు. తపస్వీ మనోహరం పబ్లికేషన్స్ వెలువరించిన ఈ నవల రూ.150. కాపీలు రచయిత్రి (99898 20215) వద్ద, అమెజాన్‌లోనూ లభ్యం అవుతాయి.

– సమ్మెట ఉమాదేవి,
98494 06722

రాజ్‌కోట్ ప్రమాదంపై అంతులేని నిర్లక్ష్యం

- మృతుల సంఖ్య కూడా వెల్లడించని యంత్రాంగం
- బిజెపి ప్రభుత్వ తీరుపై సర్వత్రా ఆగ్రహం
- 33కు చేరిన మృతుల సంఖ్య
- సుమోటోగా స్వీకరించిన హైకోర్టు



రాజ్‌కోట్‌లో అగ్ని ప్రమాదం సంభవించిన టిఆర్‌పి గేమింగ్ జోన్‌లో ఆదివారం కూడా సహాయక చర్యలు కొనసాగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాజ్‌కోట్ : గుజరాత్‌లో రాజ్‌కోట్‌లోని గేమ్‌జోన్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై బిజెపి ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యంతో వ్యవహరించిందని, సకాలంలో సహాయక చర్యలు చేపట్టడంలో తీవ్ర జాప్యం జరిగిందని బాధితుల బంధువులు వాపోతున్నారు. ఇంతటి ఘోర ప్రమాదం జరిగితే ఎంతమంది చనిపోయారన్న విషయాన్ని కానీ, ఎంత మంది గాయపడ్డారన్న వివరాలను కానీ ప్రభుత్వ యంత్రాంగం అధికారికంగా వెల్లడించపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. స్థానిక మీడియా మాత్రమే బాధితుల వివరాలను వెల్లడించింది. ఈ ఘోర ప్రమాదంలో 33 మంది సజీవ దహనమయ్యారని, మరో 15 మంది ఆచూకీ తెలియరాలేదని స్థానిక మీడియా పేర్కొంది. కాగా ఘటనా స్థలాన్ని గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఆదివారం పరిశీలించారు. గాయపడినవారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి..

ఈ ఘోర ప్రమాదానికి కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని, ఎవ్వరినీ ఉపేక్షించరాదని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఒక చిన్నారి తండ్రి ప్రదీప్ సిన్హా చౌహాన్ డిమాండ్ చేశారు. దోషులకు మరణశిక్ష విధించాలని, ఎవ్వరికీ బెయిల్ మంజూరు చేయరాదని, ఒక వేళ బెయిల్ ఇస్తే తానే ఆ దుండగులను చంపేస్తానని ఆయన ఆక్రోషంతో అన్నారు. ఈ ప్రమాదంలో ప్రదీప్ తనయుడుతో పాటు మరో నలుగురు కుటుంబ సభ్యులు కూడా ప్రాణాలు కోల్పోయారు.

మున్సిపల్ యంత్రాంగం ఏం చేస్తోంది..

ప్రయివేటు సంస్థ నిర్వహిస్తున్న ఈ క్రీడా ప్రాంగణం నాలుగేళ్ల కిందట నుంచి పని చేస్తోంది. అయితే ఇక్కడ అగ్ని ప్రమాదాల నివారణలకు సరైన ఏర్పాట్లు ఉన్నాయా? లేదా అనే విషయాన్ని స్థానిక అధికారులు ఎవ్వరూ నిర్ధారించడం లేదు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఏం చేస్తున్నారు? దీనికి సంబంధించిన ఇతర ఏజెన్సీల మాటేమిటి? అని రాజ్‌కోట్‌కు చెందిన మరో నివాసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా డబుల్ ఇంజిన్ ప్రభుత్వమంటే అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎన్ఒసికి కూడా దరఖాస్తు చేయలేదు : ఎఫ్ఐఆర్‌లో పోలీసులు

ఈ ప్రమాదానికి సంబంధించి ఆరుగురిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. టిఆర్‌పి గేమ్‌జోన్ యజమాని యువ్‌రాజ్ సింగ్ సోలంకి, మేనేజర్ నితిన్ జైన్‌ను అరెస్టు చేశారు. ఆరుగురిపై ఐపిసి సెక్షన్లు 304, 308, 336, 338, 114 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, వీరిలో ఇద్దరిని అరెస్టు చేశామని, ఇతరుల కోసం క్రైమ్ బ్రాంచ్ అన్వేషిస్తోందని రాజ్‌కోట్ పోలీసు కమిషనర్ రాజు భార్గవ తెలిపారు. ప్రమాదం చోటుచేసుకున్న గేమింగ్ జోన్ అమ్యూజ్‌మెంట్ పార్కు నిర్వాహకులు ఫైర్ సేఫ్టీ శాఖ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోలేదని, కనీసం ఎన్ఒసికి కూడా దరఖాస్తు చేయలేదని ఎఫ్ఐఆర్‌లో పోలీసులు పేర్కొన్నారు. దాదాపు 2000 చదరపు మీటర్ల ప్లాటులో నిర్మించిన మూడు అంతస్తుల భవనానికి కానీ, అక్కడ ఏర్పాటు చేసిన తాత్కాలిక టిన్ రూఫ్ నిర్మాణాలకు కానీ ఎటువంటి ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు కూడా లేవని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎంతటి నిర్లక్ష్యంతో వ్యవహరిస్తోందో ఎఫ్ఐఆర్‌లోని అంశాలు తెలియజేస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ప్రమాద ఘటనపై ప్రభుత్వం సీనియర్ పోలీస్ అధికారి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను నియమించిన సంగతి తెలిసిందే. ప్రమాదంపై 72 గంటల్లో నివేదిక ఇవ్వాలని సిట్‌ను ఆదేశించింది.

మానవ తప్పిద విపత్తు : హైకోర్టు

ఈ ఘోర ఘటన మానవ తప్పిదం వల్ల జరిగిన విపత్తు అని గుజరాత్ హైకోర్టు ఆదివారం ఉదయం పేర్కొంది. ఈ ప్రమాద ఘటనపై హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఈ నెల 27న దీనిపై జస్టిస్ బీరెన్ వైష్ణవ్, జస్టిస్ దేవన్ దేశాయితో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టనుంది. ఇలాంటి అమ్యూజ్‌మెంట్, గేమింగ్ జోన్ సంస్థలు తప్పనిసరి ఫైర్ సేఫ్టీ, ఫుడ్ సేఫ్టీ వంటి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఈ కేసును సుమోటోగా స్వీకరిస్తూ ధర్మాసనం పేర్కొంది. ఈ సందర్భంగా అహ్మదాబాద్, వడోదర, సూరత్, రాజ్‌కోట్ మున్సిపల్ కార్పొరేషన్లకు చెందిన న్యాయవాదులు అందరూ తమ ముందు సోమవారం విచారణకు హాజరు కావాలని, ఇలాంటి సంస్థల నిర్వహణకు ఎలాంటి అనుమతులు ఇచ్చారో తెలియజేయాలని ధర్మాసనం ఆదేశించింది.

ఇవిఎంను ధ్వంసం చేసిన బిజెపి అభ్యర్థి అరెస్టు

- భువనేశ్వర్‌లో ఘటన.. అదుపులోకి తీసుకున్న పోలీసులు



భువనేశ్వర్ : సార్వత్రిక ఎన్నికల్లో అనేక చోట్ల బిజెపి నాయకులు బరితెగిస్తున్నారు. ఒరిస్సాలో బిజెపి అభ్యర్థి ఒకరు రెచ్చిపోయి ఇవిఎంను ధ్వంసం చేశాడు. దీంతో పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. అతనిపై ప్రిసైడింగ్ అధికారి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్ట్ చేశారు.

ఖుర్దా జిల్లాలో చిలికా బిజెపి ఎమ్మెల్యే ప్రశాంత్ జగ్‌దేవ్ ఖుర్దా అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి పోటీ చేశారు. బెగునియా అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని కౌన్రిపట్నలో ఓటరుగా ఉన్నారు. కాగా, శనివారం ఆరో దశ పోలింగ్ సందర్భంగా ప్రశాంత్ జగ్‌దేవ్ తన భార్యతో కలిసి పోలింగ్ కేంద్రానికి వెళ్లారు. ఇవిఎం మొరాయించడంతో ఓటు వేసేందుకు కొంత సమయం వేచి ఉండాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రిసైడింగ్ అధికారి, ఆయన మధ్య వాగ్వాదం జరిగింది. ఆగ్రహించిన ప్రశాంత్, టేబుల్‌పై ఉన్న ఇవిఎంను లాగడంతో అది కిందపడి పగిలింది. దీంతో పోలింగ్‌కు విఘాతం కలిగింది. మరోవైపు ఇవిఎంను ధ్వంసం చేసిన ఆయనపై ప్రిసైడింగ్ అధికారి ఫిర్యాదు చేశారు. దీంతో ప్రజాప్రాతినిధ్య చట్టంతో పాటు ఐపిసిలోని పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రశాంత్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించడంతో ఖుర్దా జైలుకు ఆయనను తరలించారు. యుపిలో బిజెపి అభ్యర్థి తనయుడు రిగ్గింగ్‌కు పాల్పడి వీడియో తీసి, దానిని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన సంగతి తెలిసిందే. సార్వత్రిక ఎన్నికల్లో బరితెగింపుతో రెచ్చిపోతూ రిగ్గింగ్‌కు పాల్పడటం, దాడులు చేయడం వంటి చర్యలకు పాల్పడుతూ బిజెపి ప్రజాస్వామ్యంతో పరిహాసమాడుతోందని ప్రతిపక్ష ఇండియా ఫోరం నేతలు విమర్శిస్తున్నారు.

పేదల ముఖాల్లో వెలుగులు నింపుతాం

- హిమాచల్ ఎన్నికల సభలో రాహుల్



సిమ్లా : ఇండియా ఫోరం అధికారంలోకి రాగానే పేదల ముఖాల్లో వెలుగులు పూసేలా చర్యలు చేపడతామని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్రంలో తమ ప్రభుత్వం కొలువుతీరిన వెంటనే దేశంలో పేదల జాబితాను రూపొందిస్తామని, ప్రతి కుటుంబం నుంచి ఓ మహిళ పేరును ఎంపిక చేస్తామని చెప్పారు. జులై 5న దేశంలోని పేద మహిళలందరి బ్యాంక్ ఖాతాల్లో రూ. 8,500 జమ చేస్తామని అన్నారు. జులై నుంచి ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్ ఇలా ప్రతి నెలా వారి ఖాతాల్లో వేస్తామని రాహుల్ గాంధీ వెల్లడించారు.

చిన్నారుల మరణం కలచివేసింది..

గుజరాత్ లోని గేమింగ్ జోన్ లో, అదేవిధంగా ఢిల్లీలోని ఆసుపత్రిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ముక్కుపచ్చలారని చిన్నారులు చనిపోవడం తనను కలచివేసిందంటూ కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు ఆదివారం ఉదయం ఆయన ట్వీట్ చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలంటూ రాహుల్ ఆకాంక్షించారు. ఈ అగ్ని ప్రమాదాలపై ప్రభుత్వం నిష్పాక్షిక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా సహాయ కార్యక్రమాల్లో అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని కాంగ్రెస్ కార్యకర్తలను అభ్యర్థించారు.

పేదలపైకి దూసుకెళ్లిన బస్సు

- నలుగురు కార్మికులు మృతి

గోవా : దక్షిణ గోవాలో శనివారం అర్ధరాత్రి ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. రోడ్డు పక్కన ఉన్న గుడిసెల్లోకి బస్సు దూసుకెళ్లడంతో నలుగురు వలస కార్మికులు మరణించారు. మరో ఐదుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు..

గోవాలోని వెర్నా ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద వలస కార్మికులు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న గుడిసెల్లో నిద్రిస్తుండగా శనివారం అర్ధరాత్రి 11 గంటల 30 నిముషాల సమయంలో ఓ బస్సు ఆ గుడిసెల పైకి దూసుకెళ్లింది. దీంతో నలుగురు కార్మికులు అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గయపడిన మరో ఐదుగురిని మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉండడమే ప్రమాదానికి కారణమన్నారు. బాధితులకు చికిత్స చేయడంలో వైద్య సిబ్బంది జాప్యం చేయడంతో క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. బస్సు డ్రైవర్‌ను అరెస్టు చేశామన్నారు.

ఆర్మీ ఛీఫ్‌గా పాండే పదవీకాలం పొడిగింపు



న్యూఢిల్లీ : ఆర్మీ ఛీఫ్ జనరల్ మనోజ్ పాండే పదవీకాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరో నెల పాటు పొడిగించింది. పాండే పదవీకాలం ఈ నెల 31తో ముగియనుంది. ఆయన 25 నెలల పాటు సేవలందించారు. ఛీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా జనరల్ మనోజ్ సి పాండేని ఒక నెల పాటు అదే పదవిలో కొనసాగించేందుకు అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ కేబినెట్ ఆమోదం తెలిపిందని రక్షణ మంత్రిత్వ శాఖ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. దీంతో ఆర్మీ రూల్స్ 1954లోని రూల్ 16 ఎ (4) ప్రకారం ఆయన తన పదవిలో ఈ ఏడాది జూన్ 30 వరకు కొనసాగుతారని తెలిపింది. 1982లో కార్ప్స్ ఆఫ్ ఇంజనీర్స్ (ద బాంబే సాప్పర్స్) ద్వారా ఆర్మీలో చేరిన పాండే 40 ఏళ్లుగా సైన్యంలో సేవలందిస్తున్నారు. అత్యంత కీలకమైన అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల్లో సరిహద్దు రక్షణకు సంబంధించిన ఈస్టరన్ ఆర్మీ కమాండ్‌గా ఆయన పని చేశారు. 2022లో 12 లక్షల మంది సైనిక బలగానికి అధిపతిగా ఆయన బాధ్యతలు చేపట్టారు.

మతసామరస్యం చాటిన ముస్లింలు

తమిళనాడులో వినాయక మందిరానికి భూదానం



స్థలదాతలైన జమాత్ ముస్లింలను ప్రతినిధులను అభినందిస్తున్న స్థానికులు

చెన్నయ్ : తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లా పడియూర్ సమీపంలోని ఒట్టపాలయాంలో ముస్లింలు మతసామరస్యాన్ని చాటారు. స్థానికంగా హిందువులు వినాయకుడి మందిరం నిర్మించేందుకు సరైన స్థలం దొరకక ఇబ్బందులు పడుతున్న సంగతిని గమనించిన జమాత్ మసీదు నిర్వాహకులు మూడు సెంట్ల స్థలాన్ని ఉచితంగా అందజేసి ప్రశంసలు పొందారు. ఆరు లక్షల రూపాయల విలువ చేసే ఈ స్థలాన్ని ఆర్ఎంజి రోజ్‌గార్డెన్ ముస్లిం జమాత్ మసీదుకు చెందిన ప్రతినిధులు మందిర నిర్వాహకులకు ఉచితంగా అప్పగించారు. హిందూ, ముస్లింల మధ్య సోదరభావాన్ని పెంపొందించడంలో జమాత్ కృషిని స్థానికులు ప్రశంసించారు. జమాత్ ప్రతినిధులకు పూలమాలలు వేసి, భాజాభజంత్రీలతో ఘనంగా సత్కరించారు. భిన్నత్వంలో ఏకత్వమనే భారత విశిష్ట లక్షణానికి ఇది నిఖార్సైన ఉదాహరణ అని స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

ఆధార్‌పై పుకార్లు నమ్మొద్దు

- జూన్ 14 గడువు ఉచిత అప్‌డేట్ కోసమే

న్యూఢిల్లీ : ఈ ఏడాది జూన్ 14వ తేదీలోగా వ్యక్తిగత వివరాలను అప్‌డేట్ చేసుకోకపోతే ఆ తర్వాత నుంచి ఆధార్ పని చేయదంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న కథనాలను భారత విశిష్ట గుర్తింపు ప్రాధికారిక సంస్థ (ఉడాయ్) కొట్టిపారేసింది. ఇలాంటి పుకార్లను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆధార్‌లో వ్యక్తిగత వివరాలను ఉచితంగా అప్‌డేట్ చేసుకునేందుకు విధించిన గడువు వచ్చే జూన్ 14 అని తెలిపింది. అప్పటిలోగా ఆధార్ వినియోగదారులు తమ వివరాలను ఉచితంగానే అప్‌డేట్ చేసుకోవచ్చునని, అంతేకాని ఆధార్ పనిచేయకపోవడం అంటూ ఉండదని స్పష్టం చేసింది. గడువులోగా అప్‌డేట్ చేసుకోకపోతే తగిన రుసుము చెల్లించి వివరాలను అప్‌డేట్ చేసుకోవాల్సివుంటుందని ఉడాయ్ తెలిపింది.

ఉచితంగా ఆన్‌లైన్‌లో ఆధార్ వివరాలు అప్‌డేట్ చేసుకునేందుకు ఉడాయ్ తొలుత 2023 డిసెంబర్ 14 వరకు అవకాశం ఇచ్చింది. ఆ తర్వాత ఈ గడువును రెండుసార్లు జూన్ 14 వరకు పొడిగిస్తూవచ్చింది. ఆన్‌లైన్‌లో తగిన పత్రాలు సమర్పించి ఉచితంగా వివరాలు అప్‌డేట్ చేసుకోవచ్చుని ఉడాయ్ పేర్కొంది. ఆధార్ కార్డు కోసం పేరు నమోదు చేసుకున్న నాటి నుంచి పదేళ్లు పూర్తయినవారు వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని ఉడాయ్ గతంలో సూచించిన సంగతి తెలిసిందే.


మరో విమానంలో భారీ కుదుపులు

- 12 మందికి గాయాలు

డబ్లిన్ : గాల్లో ఉండగానే మరో విమానంలో భారీ కుదుపులు చోటుచేసుకోవడంతో 12 మంది గాయపడ్డారు. దోహ్ నుంచి ఐర్లండ్ వెళ్తున్న ఖతర్ ఎయిర్‌వేస్‌కు చెందిన క్యూర్017 బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానంలో భారీ కుదుపులు చోటుచేసుకున్నాయని, టర్కీ మీదుగా వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుందని, అయితే షెడ్యూలు ప్రకారంగానే విమానం సురక్షితంగా డబ్లిన్ విమానాశ్రయంలో ఆదివారం మధ్యాహ్నం 1.00 గంటలకు ల్యాండింగ్ అయిందని సంబంధిత అధికారులు తెలిపారు. అయితే కుదుపులు కారణంగా 12 మంది గాయపడ్డారని, వీరిలో ఆరుగురు ప్రయాణికులు కాగా, మిగిలిన ఆరుగురు విమాన సిబ్బంది అని తెలిపారు. సింగపూర్ ఎయిర్‌లైన్స్‌లో ఇటీవలే ఇలాంటి కుదుపులు చోటుచేసుకోవడంతో ఒకరు చనిపోగా, మరో 20 మంది గాయపడిన సంగతి తెలిసిందే.

ఆగని ఇజ్రాయిల్ దాడులు

- మరో 30 మంది గాజా పౌరులు మృతి
- చర్చల పునరుద్ధరణకు యత్నాలు



రఫా: అంతర్జాతీయ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఇజ్రాయిల్ దళాలు రఫాతో సహా గాజా స్ట్రిప్‌పై విరుచుకుపడుతున్నాయి. తాజా దాడుల్లో మరో 30 మంది పాలస్తీనీయులు చనిపోయారు. ఒక వైపు హమాస్‌పై యుద్ధం పేరుతో ఇజ్రాయిల్ యథేచ్ఛగా మారణ కాండను కొనసాగిస్తుండగా, వచ్చేవారం ఇరు పక్షాలమధ్య చర్చలు తిరిగి ప్రారంభించేందుకు మధ్యవర్తులు యత్నిస్తున్నారు. ఇజ్రాయిల్ గూఢచారి సంస్థ మొసాద్, అమెరికన్ గూఢచారి సంస్థ సిఐఎ అధిపతి, ఖతార్ ప్రధానితో జరిపిన చర్చల్లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల బోగట్టా. మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న ఖతార్, ఈజిప్టు, అమెరికా ప్రమేయంతో కొన్ని కొత్త ప్రతిపాదనలను చర్చకు పెడతాయని ఈ వర్గాలు తెలిపాయి. చర్చల పునరుద్ధరణ పై హమాస్ ఇంతవరకు ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. కాల్పుల విరమణ, బందీల విడుదలకు సంబంధించి ఇంతకు ముందు కైరోలో జరిగిన చర్చల్లో మధ్యవర్తులు సూచించిన ముసాయిదా ఒప్పందానికి హమాస్ అంగీకరించినా, ఇజ్రాయిల్ మొండిగా తిరస్కరించింది. అంతర్జాతీయ న్యాయస్థానం గాజాపై ఇజ్రాయిల్ దాడులను తక్షణమే ఆపాలని ఆదేశించడం, అంతర్జాతీయ నేర విచారణ కోర్టు (ఐసిసి) చీఫ్ ప్రాసిక్యూటర్ యుద్ధ నేరాలకు పాల్పడుతున్న నెతన్యాహుకు అరెస్టు వారెంట్ జారీ చేయాలని కోరడం వంటి పరిణామాలతో ఇజ్రాయిల్, దానికి అతిపెద్ద మద్దతుదారుగా ఉన్న అమెరికా అంతర్జాతీయంగా మరింత ఒంటరిపాటుకు గురయ్యాయి.

ఇంకోవైపు లెబనాన్ నుంచి హిజ్బుల్లాలు, యెమెన్ నుంచి హౌతీలు ఇజ్రాయిల్, దానికి మద్దతు ఇస్తున్న పశ్చిమ దేశాలపై ప్రతీకార చర్యలకు పూనుకోవడంతో ఇది ప్రాంతీయ యుద్ధానికి దారి తీసేలా ఉంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయిల్, అమెరికా చర్చల పునరుద్ధరణకు అయిష్టంగానైనా అంగీకరించకతప్పని పరిస్థితి ఏర్పడింది. చర్చలకు ఒక వైపు అంగీకరిస్తూనే మరో వైపు గాజాపై బాంబు దాడులను తీవ్రతరం చేయడం యూదు దురహంకార నెతన్యాహు ప్రభుత్వ కపటత్వాన్ని తెలియజేస్తోంది. ఇజ్రాయిల్ గత 230 రోజులుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడుల్లో పిల్లలు, మహిళలతో సహా మొత్తం 35,903 మంది పాలస్తీనీయులు చనిపోయారు. మరో 80,420 మంది గాయపడ్డారు. గాజాకు సంఘీభావంగా యెమెన్‌లోను, పశ్చిమ దేశాల్లోను ప్రదర్శనలు కొనసాగుతున్నాయి.




నగల దుకాణంలో కోట్లాది నగదు

- నాసిక్‌లో భారీ మొత్తం స్వాధీనం చేసుకున్న ఐటి శాఖ

ముంబయి : మహారాష్ట్రలోని నాసిక్‌లో ఓ నగల దుకాణంలో ఆదాయపన్ను శాఖ (ఐటి) అధికారులు నిర్వహించిన దాడుల్లో కట్టల కొద్దీ కోట్లాది రూపాయల నగదు పట్టుబడింది. స్థానిక సురానా జ్యువెలర్స్ యజమాని అప్రకటిత లావాదేవీలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఐటి శాఖ ఆదివారం ఈ దాడులు నిర్వహించింది. ఈ సోదాల్లో సుమారు రూ.26 కోట్ల నగదు, రూ.90 కోట్ల విలువైన లెక్కల్లో చూపని ఆస్తుల పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఐటి శాఖ అధికారులు తెలిపారు. ఆదాయపు పన్ను శాఖ వివిధ బృందాలను ఏర్పాటు చేసి ఈ సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. జ్యువెలర్స్ యజమాని కుటుంబ సభ్యుల ఇళ్లలో కూడా సోదాలు జరిగినట్లు సమాచారం. ఓ బులియన్ ట్రేడర్ వద్ద ఇంత పెద్ద మొత్తంలో నగదు, ఆస్తులు లభించడం చర్చలకు దారితీసింది. ప్రస్తుతం ఆ వ్యాపారి సంపద ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. మహారాష్ట్రలో గత కొన్ని రోజులుగా ఐటి శాఖ గట్టి నిఘా పెట్టింది. ఇటీవల నాందేడ్ లో రూ.170 కోట్ల విలువైన లెక్కల్లోకి రాని ఆస్తులను సీజ్ చేసింది. తరువాత తాజాగా నాసిక్‌లో ఈ దాడులు నిర్వహించింది. ఆదాయపు పన్ను శాఖ తీసుకున్న ఈ చర్య మహారాష్ట్రలో కలకలం రేపింది.

మళ్లీ అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా ఉమ్మడి పౌర స్మృతి

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా



న్యూఢిల్లీ : ముస్లిం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడటం, ఆర్టికల్ 370 రద్దు గురించి చెప్పడం, అలాగే ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి) అమలుపై మాట్లాడటం మత ఆధారిత ప్రచారం అయితే తాము చేసింది అదేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిస్సిగ్గుగా పునరుద్ఘాటించారు. ఎన్‌డిఎ మళ్లీ అధికారంలోకి రాగానే యుసిసిని దేశవ్యాప్తంగా అమల్జేస్తామన్నారు. మత ఆధారిత రిజర్వేషన్లకు తమ పార్టీ వ్యతిరేకమన్నారు. పిటిఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాల్లోనూ బిజెపి భారీ విజయం సాధిస్తున్నారు. బిజెపి 400 స్థానాల్లో గెలిచితీరుతుందని, అలాగే ఒడిషా, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్‌లోనూ ఎన్‌డిఎ ప్రభుత్వాలు ఏర్పడుతాయని అమిత్ షా జ్యోష్యం చెప్పారు. కేంద్రంలో ఈ దఫా తాము అధికారంలోకి రాగానే యుసిసి అమలు ప్రక్రియను చేపట్టి ఐదేళ్లలో దేశవ్యాప్తంగా అమల్జేసితీరుతామని చెప్పారు. ఈ ఏడాది సెప్టెంబరులో జమ్ముకాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. ఆ తర్వాత జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ప్రారంభిస్తుందని పేర్కొన్నారు. 'ఎన్‌డిఎ మూడోసారి అధికారంలోకి వస్తే భాగస్వామ్య పార్టీలతో చర్చించి వచ్చే ఐదేళ్లలో దేశవ్యాప్తంగా యుసిసి అమల్జేస్తాం. అలాగే జమిలి ఎన్నికలను కూడా నిర్వహిస్తాం. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఖర్చులు తగ్గుతాయి' అని అమిత్ షా తెలిపారు. మావోయిస్టుల ఏరివేత కార్యక్రమం కొనసాగుతోందని, భద్రతా బలగాలు మంచి విజయాలు సాధిస్తున్నాయని పేర్కొన్న ఆయన రాబోయే రెండు మూడేళ్లలో మావోయిస్టుల సమస్య లేకుండా చేస్తామన్నారు.

'ఇండియా'కు సానుకూల పవనాలు

- ప్రియాంక గాంధీ

పటియాలా : లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సానుకూల వాతావరణం ఉందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అన్నారు. ప్రచారం కోసం తాను ఏ ప్రాంతానికి వెళ్లినా, ప్రజల నుంచి మెరుగైన స్పందన లభిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. విలేకరులతో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలకు ప్రజలు బ్రహ్మరథం పడుతుండటం తాను గమనించానన్నారు. బిజెపి పాలన పట్ల విసిగి వేసారిన ప్రజలు కాంగ్రెస్ పార్టీ నేతలు నిజాయితీతో పనిచేయాలని కోరుకుంటున్నట్టు ఆమె వెల్లడించారు.

న్యాయవ్యవస్థలకు మించి మోడీ వ్యవహారశైలి

- అంతా నేనే అన్నట్టు ప్రధాని తీరు
- బిజెపి హయాంలో దర్యాప్తు సంస్థల నిర్వీర్యం : తేజస్వి యాదవ్

పాట్నా : ప్రధాని మోడీ ప్రభుత్వ వ్యవస్థలన్నింటినీ నాశనం చేశారని బీహార్ మాజీ డిప్యూటీ సీఎం, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఆదివారం పాట్నాలో విలేకరులతో మాట్లాడారు. బీహార్‌కు వచ్చి ప్రధాని తమను జైలుకు పంపుతామని బెదిరిస్తున్నారని అన్నారు. తాను న్యాయస్థానాల కంటే అధికమన్నట్టుగా మోడీ భావిస్తున్నారని వివరించారు. ఆయన వ్యవహారశైలిపై తేజస్వి అభ్యంతరం వ్యక్తం చేశారు. మోడీ కనుసన్నల్లోనే ప్రభుత్వ ఏజెన్సీలు నడుస్తున్నాయని స్పష్టమైందన్నారు. మోడీ హయాంలో దర్యాప్తు సంస్థలకు విలువ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వారిని అరెస్ట్ చేయాలి.. వీరిని విడిచిపెట్టాలని చెప్పడమే ప్రధాని పనిలా ఉందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ వ్యవస్థలను ప్రధాని మోడీ నీరుగారుస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

గుజరాత్ టు చెన్నై ముఠా గోల్డ్ దందా

- సిండికేట్ సభ్యుల అరెస్టు
- 10.5 కిలోల పసిడి స్వాధీనం

అహ్మదాబాద్ : బంగారం ధర రోజురోజుకూ ఆకాశాన్నంటుతోంది. సామాన్యుడు కనీసం కొనాలనే ఆలోచన కూడా చేయలేని పరిస్థితి. అక్రమార్కులు మాత్రం విదేశాల నుంచి కిలోల కొద్దీ బంగారాన్ని దేశానికి తీసుకువస్తున్నారు. ఎన్ని నిఘాలు పెట్టినా వీరికి అడ్డుకట్ట వేయడం కష్టంగా మారుతోంది. దీనికి మోడీ సొంత రాష్ట్రం గుజరాత్ వేదికగా మారింది. ఇక్కడి నుంచి మొన్నటి వరకు డ్రగ్స్ అక్రమ రవాణా జరిగేది. ఇప్పుడు బంగారం కూడా ఆ లెక్కలో చేరింది.

అహ్మదాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో 10.32 కిలోల బంగారం పట్టుబడింది. కీలక సమాచారం అందుకున్న రెవెన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ (డిఆర్ఐ) అధికారులు ప్రయాణీకులను తనిఖీ చేశారు. పట్టుబడ్డ వారి నుంచి మరింత సమాచారం రాబట్టి వేర్వేరు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించడంతో రూ. 7.75 కోట్లు విలువైన 24 క్యారెట్ల బంగారం పట్టుబడింది.

నిఘా వర్గాల సమాచారం ఆధారంగా, డీఆర్ఐ అధికారులు అబుదాబి నుంచి వచ్చిన ఇద్దరు ప్రయాణికులను అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం (ఎస్‌పిఐ) లో పట్టుకున్నారు. వారు లోదుస్తుల్లో దాచిపెట్టిన 3596.36 గ్రాముల బంగారం పేస్టును స్వాధీనం చేసుకున్నారు. వారిని రిసీవ్ చేసుకోవడానికి వచ్చిన మరో ఇద్దరు వ్యక్తులును సైతం అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారిస్తే సిండికేట్‌కు సంబంధించి గుట్టు రట్టయింది. ఈ సిండికేట్‌కు సంబంధించిన ఇతర సభ్యులు విమానాశ్రయానికి దగ్గర్లో బస చేసిన హోటల్లోనూ తనిఖీలు నిర్వహించారు. ఈ లోపే ఉదయం వచ్చిన మరో సిండికేట్ సభ్యుడు అక్రమంగా తీసుకువచ్చిన బంగారాన్ని.. అహ్మదాబాద్ నుంచి ముంబయికి రైలులో తరలిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. అతన్ని కూడా బోరివలి స్టేషన్ వద్ద పట్టుకుని 2,551 గ్రాముల బంగారం పేస్టును స్వాధీనం చేసుకున్నారు. అదే సిండికేట్‌కు చెందిన మరో వ్యక్తి దుబాయ్ నుంచి వస్తున్నట్టు తెలియడంతో అతన్ని కూడా పట్టుకుని 5.5 కిలోల బంగారం పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తం బంగారాన్ని అహ్మదాబాద్‌లో ఉన్న తమ గ్రూపు సభ్యుడికి అందజేయాల్సి ఉందని సమాచారం. మొత్తం ఈ అక్రమ రవాణాలో పాల్గొన్న కీలక వ్యక్తితో సహా పది మందిని కస్టమ్స్ చట్టం కింద డీఆర్ఐ అరెస్టు చేసింది. వీరంతా తమిళనాడుకు చెందిన వేర్వేరు వ్యక్తుల ద్వారా విదేశాల నుంచి బంగారం పేస్టును అక్రమంగా రవాణా చేశారు. నాలుగు నెలలుగా కొనసాగుతున్న ఈ సిండికేట్‌లో ఒక వ్యక్తి విదేశాల నుంచి తీసుకువచ్చిన బంగారాన్ని ముంబై, చెన్నైతో పలు ప్రాంతాలకు రవాణా చేస్తున్నట్టు డీఆర్ఐ విచారణలో వెల్లడైంది.

వేసవి విడిది

బొమ్మరిల్లు






పి. జాన్ పాల్,
ఇంటర్మీడియట్, ఏపీ మోడల్ స్కూలు, సి బెల్గాల్ మండలం, కోడమూరు తాలుకా, కర్నూలు జిల్లా.





ఎం. మోక్షిత,
4వ తరగతి,
తాళ్లరేవు,
కాకినాడ.



నేను చేసిన బొమ్మ





పి వెన్నెల,
8 వ తరగతి,
గుడ్ న్యూస్ స్కూల్,
ఏలూరు.



మా విహారయాత్ర-ఊటీ

హాయ్ ఫ్రెండ్స్, నా పేరు వి. సాయి వేద ధత్రీ. నేను 6వ తరగతి చదువుతున్నాను. మా కుటుంబం అంతా వేసవి సెలవులకు ఊటీ వెళ్లాము. ఊటీ అందమైన నీలగిరి పర్వతాల మధ్య ఉన్నది. మేము అక్కడ బొటానికల్ గార్డెన్ చూశాం. నీలగిరి పర్వతాల్లో ఎత్తయిన ప్రదేశం దొడ్డపెట్ట. ఊటీ సరస్సు, సహజసిద్ధమైన తేయాకు తోటలు నాకు చాలా నచ్చాయి. ఊటీ చుట్టూ అడవులు, పచ్చదనం, ప్రశాంతమైన వాతావరణం చూస్తే నాకు ఎంత సంతోషమేసిందో! ఇదంతా కొండ ప్రాంతం. ప్రకృతి ఆస్వాదించే వాళ్లకి, వేసవి ఉపశమనం కోరుకునే వాళ్లకి ఊటీ చక్కని వేసవి విడిది. తిరుగు ప్రయాణంలో మేమంతా దట్టమైన అడవి గుండా మైసూరుకు చేరుకున్నాం.



వి. సాయి వేధ ధత్రీ,
6వ తరగతి, భీమవరం.



సెలవులు సరదాలు

వేసవి సెలవులు వచ్చాయి
సంతోషాలను తెచ్చాయి
చదువుకు విరామమిచ్చాయి
ఆటకు సమయమిచ్చాయి

సందడి గుండెను ఇల్లంతా
కేరింతలతో పిల్లలమంతా
ఎగురుతూ గెంతుతు మేమంతా
సెలవులన్నీ గడుపుతము

పల్లె పట్నం తిరుగుతము
బంధువుల ఇంటికి వెళతాము
జాతరలన్నీ చుట్టేస్తాం
తినుబండారాలు తినేస్తాం

అమ్మకు సాయం చేస్తాము
పనులెన్నో నేర్చుకుంటాము
కమ్మటి వంటలు చేస్తాము
అంతా కలిసే తింటాము

- యాడవరం చంద్రకాంత్ గౌడ్,
సిద్దిపేట.

గమనిక

వేసవి సెలవుల్లో పిల్లలకు తోడుగా ప్రతిరోజూ 'వేసవి విడిది' ముస్తాబై వస్తోంది. విద్యార్థినీ విద్యార్థుల రచనలను ఆహ్వానిస్తోంది. కథలు, కవితలు, బొమ్మలు, సెలవుల్లో మీ అనుభవాలు, ప్రయాణ విశేషాలు, ఇతరత్రా కబుర్లు మెయిల్‌కి లేదా
వాట్సాప్ నెం : 8332925496కి పంపండి.
మెయిల్ ఐడీ : chinnaarips@gmail.com
- ఎడిటర్



JEEVANA
జీవన the family

భావి ఐఎఎస్‌ల కోసం ఫౌండేషన్

దేశంలో ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేని సర్వీస్ ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఎఎస్). దీన్ని భారత పరిపాలన వ్యవస్థకు ఉక్కు కవచంగా చెబుతారు. దేశాన్ని ప్రగతి పథంలో నడిపించటంలో సివిల్ సర్వెంట్ల పాత్ర ఎంతో కీలకం. అందుకనే ఐఎఎస్ కావాలని లక్షల మంది యువతీయువకులు కలలు కంటారు. ఆ కలల్ని నిజం చేసుకునే దిశగా ఏటేటా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) నిర్వహించే సివిల్ సర్వీస్ పరీక్ష రాస్తారు. అయితే, అందులో ఉత్తీర్ణత సాధించటం సులభమైంది మాత్రం కాదు. ప్రణాళికా బద్ధమైన కృషి, సాధించాలనే తపన, కఠోర దీక్షతో సాధన చేస్తేనే ఆ లక్ష్యం సాధించొచ్చునని చెబుతున్నారు శాసనమండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు. ఆ దిశగా ఆయన వేలాదిమంది యువతను సివిల్ సర్వీసెస్, ఎపిపిఎస్‌సి నిర్వహించే వివిధ గ్రూప్-1 నుంచి గ్రూప్-4 పరీక్షల వరకూ ఉచిత శిక్షణ ఇస్తున్నారు. వివిధ శిక్షణా కేంద్రాలకు, అవగాహనా శిబిరాలకు వెళ్లి తర్ఫీదునిస్తున్నారు. అలా తర్ఫీదు పొందిన ఎందరో నేడు ఆర్‌డిఒలు, సబ్ కలెక్టర్లు, ఎంపిడిఒలు, ఎంఆర్‌ఒలుగా పనిచేస్తున్నారు. మరికొందరు జాతీయ, రాష్ట్రస్థాయి పదవుల్లో ఉన్నత హోదాల్లో ఉన్నారు. ఐఎఎస్ అధికారి కావాలంటే ప్రాథమిక స్థాయిలో ఫౌండేషన్ తప్పనిసరని లక్ష్మణరావు చెబుతున్నారు. అందులో భాగంగా గుంటూరులో సన్, కెవిఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్టుల ఆధ్వర్యంలో ఐఎఎస్ ఫౌండేషన్ కోర్సును గత పదేళ్లుగా నిర్వహిస్తున్నారు.

సివిల్ సర్వీసెస్‌లో తెలుగు రాష్ట్రాల కంటే ఇతర రాష్ట్రాల అభ్యర్థులు ఎక్కువ మంది ఎంపికవుతుంటారు. చాలామంది అటువైపు దృష్టి సారించకపోవడం అందుకు ఒక కారణం. ఎక్కువమంది తెలుగు విద్యార్థులను సివిల్ సర్వీసెస్ వైపు ఆసక్తి చూపేందుకు అవసరమైన కృషిని పైన పేర్కొన్న సంస్థలు చేస్తున్నాయి. గుంటూరులోని స్టూడెంట్స్ యూనియన్ ఫర్ నేషన్ (సన్)ను యశ్వంత్, పవన్, మల్లికార్జునరావు ఏర్పాటు చేశారు. దాని ద్వారా విద్యార్థులకు కెరీర్‌గైడెన్స్, గ్రూప్ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నారు. ఇందులో కాకర్ల సాయికుమార్, ఆశిష్, సుజిత్, దేవా భాగస్వాములై ముందుకు నడిపిస్తున్నారు. సన్, కేవీఆర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ వాటి సంయుక్త ఆధ్వర్యంలో 2014 నుంచి పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఉచితంగా పది రోజులపాటు ఐఎఎస్ ఫౌండేషన్ తరగతులు నిర్వహిస్తున్నారు. గుంటూరు బ్రాడీపేట యుటిఎఫ్ కార్యాలయంలో ఈ ఉచిత తరగతులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. 8వ తరగతి నుంచి డిగ్రీ వరకూ చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు ఈ తరగతులకు ఉత్సాహంగా హాజరవుతున్నారు. 2023లో మంగళగిరిలో కూడా ఈ ఫౌండేషన్ తరగతులు నిర్వహించారు. సన్ సంస్థ సత్తెనపల్లి, వినుకొండ, మంగళగిరిలలో కూడా పోటీ పరీక్షలకు శిక్షణ, అవగాహనా తరగతులు నిర్వహిస్తోంది.



ఎక్కువ మందిని ప్రోత్సహించటమే లక్ష్యం



ఈ తరగతుల్లో ప్రిలిమ్స్, మెయిన్స్ ఎలా ఉంటాయో తెలియ జేస్తున్నాం. ఏ పరీక్ష అయినా రాసే వరకూ అభ్యర్థుల్లో ఆందోళన సహజం. ఆత్మవిశ్వాసంతో ప్రిపేర్ అయితే ప్రిలిమ్స్, మెయిన్స్‌లో కూడా విజయాన్ని సాధించొచ్చు. చేపట్టిన వృత్తి, వికాసానికే కాదు; సామాజిక శ్రేయస్సుకూ ఉపయోగపడేదిగా ఉండాలన్న తపన, శ్రమించే తత్వం ఉన్న వారు ఈ సర్వీసెస్‌ను అందుకోవచ్చు. ముందుగా సిలబస్‌పై సంపూర్ణ అవగాహన అవసరం. ప్రాథమిక స్థాయి నుంచి కృషి ప్రారంభమైతే డిగ్రీ తర్వాత ఈ పరీక్షల్లో నెగ్గే వీలుంటుంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సివిల్ సర్వీసెస్‌కు తక్కువమంది ఎంపికవుతున్నారు. కెరీర్ ఆప్షన్ చాలా పరిమితంగా ఉండటమే కారణంగా నేను భావిస్తున్నా. అందుకనే పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో 2014 నుంచి ఈ ఫౌండేషన్ తరగతులు నిర్వహిస్తున్నాం. సిలబస్ విశ్లేషణతోపాటు నిత్యం వార్తా పత్రికలు, ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాలను క్షుణ్ణంగా చదివే అలవాటు చేస్తున్నాం.

- కెఎస్ లక్ష్మణరావు
విద్యావేత్త, కృష్ణా, గుంటూరు జిల్లా ఎమ్మెల్సీ

ఏమేమి బోధిస్తున్నారంటే...

ఈ తరగతులు ఈనెల 21 నుంచి ప్రారంభమయ్యాయి. 30వ తేదీ వరకూ కొనసాగుతాయి. ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకూ తరగతులు జరుగుతున్నాయి. సివిల్ సర్వీసెస్ పరీక్షతోపాటు గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షకు కావాల్సిన అర్హలతోపాటు ఎలా సిద్ధం కావాలో నిపుణులు అవగాహన కల్పిస్తున్నారు. సామాజిక అంశాలు, ప్రపంచ పరిణామాలు, చారిత్రక, ఆర్థిక, రాజకీయ అంశాలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, విద్య, వైజ్ఞానిక అంశాలు, గణితం బోధించటంతో పాటు వర్తమాన అంశాలపై పట్టు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు. ఏ అంశంపైనా కూలం కుషంగా తెలుసుకోవటం, లోతుగా పరిశీలించటం, తెలియని విషయాల గురించి అన్వేషించటం, రాజ్యాంగం, హక్కులు, బాధ్యతలు మొదలైన విషయాల గురించి తెలుసుకునే పద్ధతులపై కూడా అవగాహన కల్పిస్తున్నారు.

- యడవల్లి శ్రీనివాసరావు

విశేషమైన ఆదరణ



నేను 2014లో ఐఎఎస్ ఫౌండేషన్ తరగతులకు హాజరయ్యాను. ఆ తర్వాత ఇక్కడి తరగతుల స్ఫూర్తితో వాలంటీర్‌గా చేరాను. అప్పటి నుంచి 'సన్' ద్వారా తరగతులు కూడా నిర్వహిస్తున్నాం. గతేడాది మంగళగిరిలో ఏర్పాటు చేసిన తరగతుల్లో అశ్విన్ బోధించారు. ఈ ఏడాది ఆయన ఐపిఎస్‌కి ఎంపికయ్యారు.

- కాకర్ల సాయికుమార్, కోఆర్డినేటర్, సన్

ఫౌండేషన్‌తోనే... పోస్టింగ్ వరకూ



ఈ ఫౌండేషన్ తరగతులు సామాన్య విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. నేను ఈ తరగతులకు హాజరై ప్రిపేర్ అయ్యాను. బిటెక్ పూర్తయ్యాక 2018 గ్రూప్-1 పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఎంపిడిఒగా ఎంపికయ్యాను.

- కొండా యుగకీర్తి, ఎంపిడిఒ,
ప్రకాశం జిల్లా.

ఆక్యుపెన్సీ ఎందుకు ఉండటం లేదు?

ఒకప్పుడు వేసవి అంటే సినిమా థియేటర్లకు పండగ. కానీ, ఇప్పుడు ..? ప్రేక్షకులు రాక వెలవెలపోతున్నాయి. రోజువారీ నిర్వహణా ఖర్చులు కూడా రాక మూతపడే పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ఈ పరిస్థితికి కారణం ఏమిటి? పరిష్కార మార్గాలు ఏమిటి? ఇదిప్పుడు సినీ పరిశ్రమలో పెద్ద చర్చగా ఉంది.

వేసవిలో పిల్లలకు సెలవులు ఉండటం, కుటుంబాలు మొత్తంగా పర్యాటక ప్రదేశాల సందర్శనలకు వెళ్లి వస్తుండటం మామూలే! మధ్యలో ఇంటిల్లిపాదీ సినిమా థియేటరుకు వెళ్లటం సహజమే! పరీక్షలు పూర్తి చేసిన విద్యార్థులు, సెలవుల్లో కలిసిన స్నేహితులూ ఉమ్మడిగా సందడి చేసే ప్రదేశాల్లో సినిమా హాళ్లు కూడా ఉంటాయి. కానీ, ఈ వేసవి సెలవుల్లో మాత్రం అలాంటి సన్నివేశాలు కనపడలేదు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. అన్నిటికన్నా పెద్ద హీరోల సినిమాలు ఈసారి ఒక్కటీ రాకపోవటం కూడా ఒక ముఖ్య కారణం. నిర్మాతలు, దర్శకులు కొత్త సినిమాల విడుదల తేదీలను మే నుంచి జూన్‌కు మార్చుకున్నారు. ఆక్యుపెన్సీ లేకపోవటంతో చిన్న హీరోల సినిమాలను విడుదల చేసేందుకు నిర్మాతలు ముందుకు రాలేని పరిస్థితి! థియేటర్లకు ప్రేక్షకులు రాకపోవటంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని భావించిన సింగిల్ థియేటర్ల యజమానులు ఈనెల 17 నుంచి 31 వరకూ మూసివేతకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఎన్నికల ప్రక్రియ పూర్తికావటంతోపాటు ఆదివారంతో ఐపిఎల్ ముగింపు కానుంది.

పెద్ద హీరోల అనాసక్తి

తెలుగు చలనచిత్ర నిర్మాణంలో ఎక్కువ భాగం హీరోలకు రెమ్యూనరేషన్‌గానే పోతున్నదని, ఇది సినిమాలకు నష్టం తెచ్చిపెడుతుందని ఒక వాదన గట్టిగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో హీరోలు చేయాల్సింది ఏమిటి? గతంలో ఇలాంటి పరిస్థితులు తలెత్తితే- పరిశ్రమను బతికించటం కోసం నాటి హీరోలైన ఎన్టీఆర్, ఎఎన్నార్, కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు తదితరులు కృషి చేసేవారు. తమ రెమ్యూనరేషన్ కన్నా సినిమా పరిశ్రమ బతకటమే ప్రధానంగా ఆలోచించేవారు. ఇప్పుడు అలాంటి చొరవ ఎవరూ తీసుకోవటం లేదు. ప్రస్తుతం హీరోల రెమ్యునరేషన్ రూ.60 కోట్ల నుంచి రూ.125 కోట్ల వరకూ వెళ్లిందని సమాచారం. ఇది ఆయా సినిమా బడ్జెట్‌లో దాదాపు సగం. హీరోయిన్, మిగతా క్యారెక్టర్ ఆర్టిస్టుల పారితోషికాలు ఉండనే ఉంటాయి. ఒక్క పెద్ద సినిమా తీయాలంటే వందల కోట్ల బడ్జెట్‌ను నిర్మాత కేటాయించాల్సివస్తోంది. తక్కువ బడ్జెట్‌తో, చిన్న హీరోలతో సినిమాలు చేస్తే అవి పూర్తిగా కథ మీదనే ఆధారపడి ఆడుతున్నాయి. ప్రత్యేకమైన ఇమేజీ ఉండడం లేదు. అదే పెద్ద హీరోలతో తీస్తే కనీసం కనీసం గ్యారంటీ ఉంటుందనే అభిప్రాయం నిర్మాతల్లోనూ ఉంది. ఆయా హీరోల అభిమాన గణాలు, ఇతరత్రా ఇమేజీ ప్రేక్షకులను థియేటరు వరకూ తీసుకొస్తుందనేది వారి ఆలోచన. అందుకనే పారితోషికాలు ఎంత ఎక్కువగా ఉన్నా వారితోనే సినిమా నిర్మాణానికి మొగ్గు చూపుతున్న పరిస్థితీ ఉంది. పెద్ద హీరోల సినిమాలను పండుగలు, ఇతరత్రా అకేషన్లలో విడుదల చేస్తే వసూళ్లు బాగానే రాబట్టొచ్చని భావిస్తున్నారు. లెక్క కోసం సినిమాలు చేసే కంటే భారీ బడ్జెట్ సినిమాలైతే కొద్దిమేరైనా గ్యారంటీ ఉంటుందనే ఉద్దేశంతో పెద్దహీరోలు చూస్తున్నారు. నాలుగైదు సినిమాలకు వచ్చే మొత్తం ఒక్క సినిమాతోనే పొందొచ్చుననేది కూడా వారి అభిప్రాయం. ఇక్కడే అసలు సమస్య వస్తోంది.







పెద్ద సినిమాలతో మళ్లీ కళ?

యువ కథానాయకుల చిత్రాలు, పరిమిత వ్యయంతో రూపొందిన సినిమాలకి బాగుందనే టాక్ వచ్చాకే ప్రేక్షకులు థియేటర్లకి వస్తున్నారు. అగ్ర హీరోల సినిమాలతో కొన్ని రోజులపాటు కళకళలాడుతుండే విషయం తెలిసిందే. ఈనెల 9న ప్రభాస్ 'కల్కి 2898 ఎ.డి' వస్తుందనుకుంటే ఆ సినిమా జూన్ 27కి వాయిదా పడింది. పుష్ప-2 ఆగస్టు 15, దేవర అక్టోబర్ 10న, 29న గేమ్ ఛేంజర్ విడుదల కానున్నాయి. చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' 2025 సంక్రాంతికి విడుదల కానుంది. ఇటీవల 'గ్యాంగ్', 'లవ్ మీ..ఇఫ్ యు డేర్' సినిమాలు విడుదలైనా పెద్దగా ఆదరణకు నోచుకోలేదు.

ఈనెల 31న విశ్వక్‌సేన్ 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి', సుధీర్‌బాబు 'హరోం హర', కాజల్ 'సత్యభామ', కార్తికేయ కథానాయకుడిగా నటించిన 'భజే వాయు వేగం', ఆనంద్ దేవరకొండ 'గం గం గణేశా', మ్యూజిక్ షాపు మూర్తి చిత్రాలను వాయిదా వేసుకుంటే మంచిదని ఇప్పటికే ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు సూచించిన విషయం తెలిసిందే!



ఫైనల్లో తడబాటు

- రన్నరప్‌తో సరిపెట్టిన సింధు
- మలేషియా మాస్టర్స్ సూపర్ 500

కౌలాలంపూర్ (మలేషియా) : భారత బ్యాడ్మింటన్ స్టార్ పి.వి సింధుకు మళ్లీ నిరాశే ఎదురైంది. ఈ సీజన్‌లో తొలి టైటిల్ విజయం కోసం ఎదురుచూస్తున్న తెలుగు తేజం.. మలేషియా మాస్టర్స్ సూపర్ 500 టోర్నమెంట్‌లో ఆఖరు అడుగులో తడబడింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో పి.వి సింధు మూడు గేముల పోరాటంలో పరాజయం పాలైంది. సుమారు గంటన్నర పాటు సాగిన టైటిల్ పోరులో చైనా షట్లర్, రెండో సీడ్ జాంగ్ జి యు విజయం సాధించింది. 21-16, 5-21, 16-21తో పి.వి సింధు ఓటమి చెందింది. ఫైనల్లో సింధు తొలి గేమ్‌లో దూకుడు చూపించింది. 6-6 వరకు జాంగ్ పోటీ ఇచ్చినా.. ఆ తర్వాత సింధు ముందంజ వేసింది. 11-9తో విరామ సమయానికి ముందంజ వేసింది. ఆ తర్వాత వరుసగా ఐదు పాయింట్లు ఖాతాలో వేసుకుంది. అదే ఊపులో 21-16తో తొలి గేమ్‌లో గెలుపొందింది. కీలక రెండో గేమ్‌లో సింధు చతికిల పడింది. చెలరేగిన జాంగ్ 11-3తో విరామ సమయానికి తిరుగులేని ఆధిక్యం సాధించింది. ద్వితీయార్థంలో వరుసగా 9 పాయింట్లు సాధించిన జాంగ్ 21-5తో ఏకపక్షంగా రెండో గేమ్‌ను సొంతం చేసుకుంది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో సింధు పుంజుకుంది. 11-3తో ఎదురులేని ఆధిక్యం దక్కించుకుంది. కానీ విరామ సమయం తర్వాత జాంగ్ గొప్పగా పుంజుకుంది. 8-11తో అంతరం కుదించిన జాంగ్.. వరుసగా ఏడు పాయింట్లతో 15-13తో ముందంజ వేసింది. ఆధిక్యం చేజార్చుకున్న సింధు మళ్లీ పుంజుకోలేకపోయింది. 21-16తో మూడో గేమ్‌తో పాటు మహిళల సింగిల్స్ టైటిల్ చైనా షట్లర్ సొంతమైంది. పురుషుల సింగిల్స్‌లో విక్టర్ అక్సెసెన్ (డెన్మార్క్), పురుషుల డబుల్స్‌లో డెన్మార్క్ జోడీ కిమ్, అండర్స్‌లు విజేతలుగా నిలిచారు. మహిళల డబుల్స్‌లో జపాన్ జంట టైటల్ సాధించగా.. మిక్స్‌డ్ డబుల్స్‌లో మలేషియా షట్లర్లు సూన్, జెమీలు చాంపియన్లుగా నిలిచారు.



ఒసాక శుభారంభం

- అల్కరాజ్, ఒస్టాపెంకో ముందంజ
- ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ 2024



పారిస్ (ఫ్రాన్స్) : జపాన్ టెన్నిస్ స్టార్ నవొమి ఒసాక పునరాగమనంలో ఆకట్టుకునే ప్రదర్శన చేసింది. ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో 6-1, 4-6, 7-5తో లూసియ (ఇటలీ)పై మూడు సెట్ల మ్యాచ్‌లో విజయం సాధించింది. ఆరు ఏస్‌లు సంధించిన ఒసాక.. ఐదు బ్రేక్ పాయింట్లతో మెరిసింది. తొమ్మిదో సీడ్ జెలెనా ఒస్టాపెంకో వరుస సెట్లలో గెలుపొందింది. రోమానియ అమ్మాయి జాక్వలైన్‌పై 6-4, 7-5తో అలవోక విజయం సాధించింది. చైనా అమ్మాయి వాంగ్ యఫాన్ 6-3, 6-3తో మరియ టిమోఫెవపై వరుస సెట్లలో ఏకపక్ష విజయం నమోదు చేసింది. పురుషుల సింగిల్స్‌లో మూడో సీడ్ కార్లోస్ అల్కరాజ్ ముందంజ వేశాడు.

తొలి రౌండ్ మ్యాచ్‌లో 6-1, 6-2, 6-1తో అమెరికా ఆటగాడిపై ఏకపక్ష విజయం సాధించాడు. ఆరో సీడ్ ఆండ్రీ రూబ్లెవ్ 6-2, 6-7(3-7), 6-3, 7-5తో డానియల్‌పై గెలుపొందగా..పదో సీడ్ దిమిత్రివ్ 6-4, 6-3, 6-4తో అలెగ్జాండర్‌ను చిత్తు చేశాడు. బ్రాండన్ నకషిమ 6-1, 6-7(6-8), 6-3, 6-2తో సహచర అమెరికన్‌పై సాధికారిక విజయం సాధించాడు.

గురి తప్పిన దీపిక

ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్ 2

న్యూఢిల్లీ : ప్రపంచ మాజీ వరల్డ్ నం.1 ఆర్చర్, భారత స్టార్ దీపిక కుమారి ప్రపంచకప్ స్టేజ్ 2 మెడల్ వేటలో గురి తప్పింది. ఆదివారం జరిగిన మహిళల వ్యక్తిగత రికర్వ్ విభాగం సెమీఫైనల్లో వరల్డ్ నం.2, దక్షిణ కొరియా షట్లర్ లిమ్ 6-2తో గెలుపొందింది. 28-26, 28-28, 28-27, 27-27తో లిమ్ పైచేయి సాధించింది. గత నెల షాంఘై వరల్డ్‌కప్‌లో పసిడి వేటలో లిమ్‌కు దీపిక కుమారి తలొంచిన సంగతి తెలిసిందే. ఇక కాంస్య పతక పోరులోనూ దీపిక కుమారికి నిరాశ తప్పలేదు. వరల్డ్ నం.3 వెలెన్సియ (మెక్సికో) చేతిలో 4-6 (26-29, 26-28, 28-25, 27-25, 26-29)తో నిరాశపరిచింది. కాంపౌండ్ విభాగంలో భారత ఆర్చర్లు రెండు పతకాలు సాధించారు. మహిళల జట్టు విభాగంలో స్వర్ణం, మిక్స్‌డ్ జట్టు విభాగంలో సిల్వర్ మెడల్ దక్కించుకున్నారు.



దీప పసిడి వెలుగు

- జిమ్నాస్టిక్స్ ఆసియా చాంపియన్‌షిప్స్

తాష్కెంట్ : భారత స్టార్ జిమ్నాస్ట్ దీప కర్మాకర్ నవ చరిత్ర సృష్టించింది. 21 నెలల నిషేధం ముగించుకుని 30 ఏండ్ల వయసులో మళ్లీ వాల్ట్ విన్యాసం మొదలుపెట్టిన దీప కర్మాకర్ ఆసియా జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్స్‌లో పసిడి పతకం సాధించింది. ఆసియా చాంపియన్‌షిప్స్‌లో భారత్ నుంచి ఎవరూ స్వర్ణం సాధించలేదు. దీప కర్మాకర్ ఈ ఘనత సాధించిన తొలి భారత జిమ్నాస్ట్‌గా నిలిచింది. 2015 ఆసియా చాంపియన్‌షిప్స్‌లో కాంస్యం సాధించిన దీప కర్మాకర్.. ఈ సారి పతకం రంగు పసిడికి మార్చుకుంది. మెడల్ రేసులో ఎనిమిది మంది జిమ్నాస్ట్‌లు పోటీపడగా.. దీప కర్మాకర్ రెండు వాల్ట్ విన్యాసాల్లో సగటు 13.566 పాయింట్లు సాధించింది. నార్త్ కోరియాకు చెందిన జిమ్నాస్ట్‌లు కిమ్ సన్ (13.466), జో (12.966) వరుసగా రజత, కాంస్య పతకాలు సాధించారు. 2016 రియో ఒలింపిక్స్ వాల్ట్ ఫైనల్లో నాల్గో స్థానంలో నిలిచి తృటిలో పతకం చేజార్చుకున్న దీప కర్మాకర్.. 2014 గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడల్లో కాంస్య పతకం సాధించింది. గత ఆసియా చాంపియన్‌షిప్స్‌లో భారత జిమ్నాస్ట్‌లు అశీష్ కుమార్ (2006), దీప కర్మాకర్ (2015), ప్రణతి నాయక్ (2019, 2022) కాంస్య పతకాలు సాధించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68